
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
శనివారం 12 ఏప్రిల్ 2025

- పీఈటీ పోస్టుల భర్తీకి వింత సిలబస్
- క్రీడా నైపుణ్యం ఉన్న వారికి అవకాశాలు తక్కువే
- గత ప్రభుత్వ సిలబస్ మార్చాలంటున్న విద్యావేత్తలు
- వచ్చే డీఎస్సీకి మార్పులు చెయ్యాలి.. లేకుంటే ఆటలు అబాసుపాలే
- థియరీ 70, క్రీడా ప్రావీణ్యానికి 30 శాతం ప్రాధాన్యం ఇవ్వాలని సంఘాల అభ్యర్థన

ఆటలొద్దు.. పాఠాలు చాలు



ఆటలు ఆడించాలి.. క్రీడల్లో శిక్షణ ఇవ్వాలి.. పోటీలతో స్ఫూర్తి నింపాలి.. మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలి.. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా వేదికలపై విజయ కేతనం ఎగరేసేలా క్రీడకారులను తీర్చిదిద్దాలి.. వారే వ్యాయామ ఉపాధ్యాయులు. కానీ వ్యాయామ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యే వారికి క్రీడా నైపుణ్యాలు అవసరం లేదట.. తరగతి గదుల్లో పాఠాలు బోధిస్తే చాలంటూ గత వైసీపీ ప్రభుత్వం డీఎస్సీలో చేర్చిన వింత సిలబస్‌పై వివిధ వర్గాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. త్వరలో డీఎస్సీ ప్రకటించనున్న నేపథ్యంలో ఈ వింత సిలబస్‌ను కూటమి ప్రభుత్వం మార్చాలని విద్యావేత్తలు డిమాండ్ చేస్తున్నారు. వచ్చే డీఎస్సీకి మార్పులు చెయ్యాలని లేకుంటే పాఠశాల స్థాయిలో ఆటలు అబాసుపాలేనని.. బడి పిల్లల్లో క్రీడా స్ఫూర్తి కోల్పోయి శారీరక, మానసిక ఎదుగుదల కోల్పోతారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో డీఎస్సీ సిలబస్‌లో ఉన్నట్లుగా థియరీ 70 శాతం, క్రీడా ప్రావీణ్యానికి 30 శాతం ప్రాధాన్యం ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాలు అభ్యర్థిస్తున్నాయి.



క్రీడల్లో శిక్షణ ఇస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

తెనాలి, ఏప్రిల్ 11, (ఆంధ్రజ్యోతి): వ్యాయామ ఉపాధ్యాయులంటే బడుల్లో చిన్నారులను మైదానాల్లో పరుగులు పెట్టించాల్సిన అవసరం లేదట. ఆటలతో సంబంధం లేదంట. అసలు వ్యాయామ ఉపాధ్యాయులకు క్రీడా నైపుణ్యాలే అవసరం లేదంట. ఈ వింత సిలబస్‌తో గత వైసీపీ ప్రభుత్వం 2024లో డీఎస్సీని ప్రకటించింది. ఎటువంటి స్కిల్ టెస్ట్ లేకుండా కేవలం థియరీలో నైపుణ్యం ఉంటే చాలని వ్యాయామ ఉపాధ్యాయుల ఎంపిక విషయంలో మార్పులు చేసింది. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని, ఉత్సాహాన్ని నింపాల్సిన ఉపాధ్యాయులకు ఆ నైపుణ్యాలు లేకుండా ఎంపికైతే నెలకొనే పరిస్థితి విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలకు చదువుతోపాటు క్రీడలకూ అంతే ప్రాధాన్యం ఇవ్వాలి. దేహదారుఢ్యాన్నే కాకుండా, మానసిక వికాసాన్ని పెంపొందించే క్రీడలు నేర్పించే వారు ఆటల్లో నైపుణ్యం ఉన్న క్రీడాకారులై ఉండాలి. అటువంటి వారికి ప్రాధాన్యం ఇస్తే రేపటి రోజున మైదానాల్లోనూ చిన్నారులను పరుగులు పెట్టించగలుగుతారు. కానీ ఎటువంటి ఆటలతో పనిలేకుండా, ఏ క్రీడా నైపుణ్యం లేకుండా కేవలం పాఠాలు చెప్పగలిగినవారు, ఛాయిస్‌తో సమాధానాలు రాసి, అదృష్టం కలసి వచ్చిన వారు వ్యాయామ ఉపాధ్యాయులైతే రేపటి రోజున రాష్ట్రంలో క్రీడల పరిస్థితి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. స్కిల్ టెస్ట్ విధానాన్ని కాదని థియరీకే ప్రాధాన్యం ఇస్తూ జారీ చేసిన గత ఉత్తర్వులపై వ్యాయాయ ఉపాధ్యాయులుగా రాణించాలని ఆశపడేవారికి శరాఘాతంగానే మారాయి. అయితే కూటమి ప్రభుత్వం రావడంతో వ్యాయామ ఉపాధ్యాయులుగా రాణించాలనుకునే వారిలో ఆశలు చిగురించాయి. గతంలో వైఎస్ హయాంలో కూడా 100 శాతం థియరీకే ప్రాధాన్యం ఇవ్వగా ఆ తర్వాత చంద్రబాబు ప్రభుత్వం రద్దుచేసి, పాత పద్ధతినే కొనసాగించింది. జగన్ ప్రభుత్వంలో వైఎస్ హయాంలోని సిలబస్‌నే తిరిగి ప్రవేశపెట్టారు. 1882 నాటి హంటర్ కమిషన్ నుంచి 1977 నాటి

(మిగతా 8వ పేజీలో)

క్రీడలతో సంబంధం లేని సిలబస్

డీఎస్సీలో పీఈటీ పోస్టులకు గతంలో ఉన్న 70 శాతం థియరీ, 30 శాతం ప్రాక్టికల్స్‌తో కూడిన ప్రాక్టికల్స్ సిలబస్‌గా ఉండేది. జగన్ ప్రభుత్వం ప్రాక్టికల్ టెస్ట్ అవ సరం లేదని, కేవలం థియరీలో ఉత్తీర్ణత సాధిస్తే చాలన్నట్లు మార్చేశారు. అదేమని పీడీ, పీఈటీ సంఘాలు ప్రశ్నిస్తే గర్భిణులు పరీక్షల్లో పాల్గొంటే ప్రాక్టికల్స్ ఎలా చేస్తారని, అటువంటి వారికోసమే ఆ విధానాన్ని తొలగించి, కేవలం థియరీకే ప్రాధాన్యం ఇచ్చామంటూ కబుర్లు చెప్పుకొచ్చారు. శారీరక వ్యాయామానికి సంబంధించిన థియరీ, క్రీడల్లో ఏర్పడే గాయాలకు చికిత్స వంటివాటితో లోతుగా సిలబస్ ఇచ్చి, వ్యాయామానికి సంబంధించిన లేకపోవడం విస్తు కలిగిస్తున్నది. పైగా ఇవన్నీ ప్రశ్నలకు పేరాగ్రాఫ్‌లుగా సమాధానాలు వివరణాత్మకంగా రాయాల్సిన పనికూడా లేదు. కేవలం ఆబ్జెక్టివ్ విధానంలో సమాధానాలుగా నమోదు చేస్తే సరిపోతుంది. ఈ పద్ధతిలో చివరకు థియరీలో కూడా ప్రావీణ్యం చూపాల్సిన అవసరం లేకుండా కేవలం అదృష్టాన్ని పరీక్షించుకున్నాచాలన్నట్లు సిలబస్ రూపొందించడం విశేషం. ఇటువంటి వారు వ్యాయామ ఉపాధ్యాయులైతే రేపటి తరం చిన్నారుల క్రీడా నైపుణ్యం అటకెక్కినట్లే.

సాగర్ కుడికాల్వకు నీరు బంద్


- నీటి సరఫరాను నిలిపేసిన అధికారులు
- బుగ్గవాగు నుంచి రెండు రోజులు మాత్రమే
- జలాశయంలో 515 అడుగులకు పడిపోయిన నీరు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నాగార్జున సాగర్ జలాశయం నుంచి కుడి కాల్వకు నీటి సరఫరా నిలిచిపోయింది. జలాశయంలో నీటి మట్టాలు పడిపోవడంతో కుడి కాల్వకు నీటి విడుదలను జలవనరుల శాఖ నిలిపేసింది. ప్రస్తుతం బుగ్గవాగు నుంచి స్వల్పంగా నీటిని సరఫరా చేస్తున్నారు. ఇది కూడా రెండు రోజుల్లో పూర్తిగా నిలిచిపోనున్నది. ఇక డ్యాం నుంచి నీటి సరఫరా ఉండదని అధికారులు తేల్చి చెబుతున్నారు. జలాశయంలో నీటి నిల్వ 140.49 టీఎంసీలకు పడిపోయింది. సాగర్ డెడ్ స్టోరేజి 498 అడుగులు కాగా ప్రస్తుతం 515 అడుగులకు చేరింది. ప్రస్తుతం జలాశయంలో ఉన్న 28.31 టీఎంసీల నీటిని ఇరు రాష్ట్రాలు వినియోగించుకునే అవకాశం ఉంది. డ్యాంకు వరద వచ్చే వరకు ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన పరిస్థితులు నెలకున్నాయి. ఈ పరిస్థితుల్లో నీటి విడుదలను నిలిపేశారు. జలాశయంలో ఉన్న నీటి నిల్వలను వేసవిలో తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించాలని కేఆర్ఎంబీ, ప్రభుత్వం నిర్ణయించింది. మే నెల మూడో వారంలో తాగునీటి అవసరాలకు డ్యాం నుం.చి నీటిని విడుదల చేయనున్నట్లు జలవనరుల శాఖ ఎస్పీ కృష్ణమోహన్ తెలిపారు. నీటి సరఫరా నిలిపివేయడంతో కాల్వల చివర భూముల్లో వరి సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు.

20 శాతం వరకు ఆవిరి..

ఏప్రిల్ నెలలోనే ఎండ తీవ్రత అధికంగా ఉంది. మే నెలలో 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ చెబుతున్నది. ఈ నేపథ్యంలో జలాశయంలో ఎండకు ఆవిరి కూడా అధికంగా ఉండే అవకాశం ఉంది. ఉన్న నీటిలో 20 శాతం వరకు ఆవిరయ్యే అవకాశం ఉంటుందని అధికారుల అంచనా. ఇది దాదాపు నాలుగు నుంచి ఐదు టీఎంసీలని అధికారులు భావిస్తున్నారు. అవసరం లేని సమయంలో అధికంగా నీటిని కాల్వలకు సరఫరా చేయడంతో పెద్దఎత్తున నీరు వృథాగా వాగుల్లో ప్రవహించింది. ముందస్తు చర్యలు చేపట్టి ఉంటే తాగు నీటికి గడ్డు పరిస్థితులు ఏర్పడేవి కాదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.



సాగర్ జలాశయం నుంచి కుడికాలువకు నిలిచిపోయిన నీటి సరఫరా

ధర పతనం తగ్గిన ఆదాయం



- మిర్చి యార్డు ఆదాయంలో 16 శాతం లోటు
- రూ.106 కోట్ల లక్ష్యం కాగా రూ.90 కోట్లే వసూలు

గుంటూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మిర్చి ధరలు పతనమై రైతులు అల్లాడుతుండగా.. ఆ ప్రభావం గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (జీఏంసీ) ఆదాయంపై కూడా తీవ్ర ప్రభావన్నే చూపింది. కొన్నేళ్లలో ఎప్పుడూ లేనివిధంగా మార్కెట్ ఫీజు వసూళ్లలో మిర్చియార్డు లక్ష్యాన్ని అందుకోలేకపోయింది. ఈ నేపథ్యంలో ఆదాయంలో నుంచి వివిధ పనుల కోసం ఖర్చు చేసే నిధులను ప్రభుత్వం సక్రమంగా విడుదల చేస్తుందో, లేదో తెలియని పరిస్థితి నెలకొన్నది. గత ఆర్థిక సంవత్సరంలో గుంటూరు ఏఎంసీకి మార్కెటింగ్ శాఖ రూ.106 కోట్ల సెస్సు వసూళ్లని లక్ష్యంగా నిర్దేశించింది. అయితే గత ఆరేడు నెలలుగా మిర్చి ధరలు నేలచూపులు చూస్తున్నాయి. క్వింటాల్ ధర రూ.7 వేల నుంచి రూ.11 వేల మధ్యనే కొనసాగుతుంది. దీంతో మిర్చియార్డులో టర్నోవర్ తగ్గింది. ఆ ప్రభావం ఒక శాతం వసూలు చేసే మార్కెట్ సెస్సుపై పడింది. మార్చి మొదటి వారంలో రూ.77.40 కోట్లు వసూలైంది. గత నెల నుంచి నిత్యం లక్షా 20 వేలకు పైగా మిర్చి టిక్కీలు యార్డుకు రావడంతో కొద్దిగా ఆదాయం పెరిగింది. అయినా ఆర్థిక సంవత్సరం ముగిసిన మార్చి 31కి సెస్సు రూ.90 కోట్ల వరకే వసూలైంది. కేటాయించిన లక్ష్యం కంటే దాదాపుగా 16 శాతం లోటు ఏర్పడింది.

బడ్జెట్‌పై కసరత్తు..

నూతన ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌పై మార్కెటింగ్ శాఖ కసరత్తు ప్రారంభించింది. మార్కెట్ ఫీజు లక్ష్యం, యార్డులో చేపట్టే పనులకు సంబంధించిన ప్రతిపాదనలను మార్కెటింగ్ శాఖ రాష్ట్ర డైరెక్టర్, కమిషనర్ విజయసునీతకు నివేదించి ఆమోదం తీసుకోనున్నారు. అయితే గత ఏడాది నిర్దేశించిన మార్కెట్ ఫీజు రూ.106 కోట్ల లక్ష్యాన్ని తగ్గిస్తారా... అలానే ఉంచుతారా అన్నది సస్పెన్స్‌గా మారింది. వేసవి సెలవుల అనంతరం ఏమైనా ధర పెరిగితే తప్ప ఆదాయం పెరగదు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను తప్పక అన్వేషించుకోవాల్సిన పరిస్థితి జీఏంసీకి ఉత్పన్నమైంది.



వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ ముస్లిం ఐక్యవేదిక, ఉలేమాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ముస్లింలు గుంటూరులో శాంతియుతంగా ధర్నా చేశారు. శుక్రవారం మధ్యాహ్నం నమాజ్ అనంతరం ముస్లింలు పెద్దసంఖ్యలో పాత బస్టాండ్ సెంటర్‌లో నిరసన తెలిపారు. - గుంటూరు

సీసీ రోడ్ల పనులకు శ్రీకారం



పనులు చేపట్టకముందు రోడ్డు

- ఏళ్ల సమస్య పరిష్కారమవుతుందని హర్షం
- అక్షరం అండగా పరిష్కారమే అజెండాకు స్పందన
- సమస్యలపై ఆంధ్రజ్యోతి చొరవ చూపాలని ప్రజల ఆకాంక్ష



మార్చి 25న కౌన్సిలర్ వాసిరెడ్డి లింగమూర్తితో కలిసి శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఏళ్లుగా సరైన రోడ్డు లేక పడిన అవస్థలు త్వరలో పరిష్కారం కానున్నాయి. వర్షం వస్తే బురద రోడ్డుతో ఇళ్లలో నుంచి బయటకు అడుగుపెట్టలేని పరిస్థితులు మారిపోనున్నాయి. స్థానికులు పడుతున్న ఇబ్బందులపై ఆంధ్రజ్యోతి వినూత్నంగా చేపట్టిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమానికి స్పందన వచ్చింది. ప్రజాసమస్యల పరిష్కారంపై జనవరి 28న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పట్టణంలోని 31, 23వ వార్డులో 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమంలో పాల్గొని ప్రజా సమస్యలను పరిశీలించి పలు హామీలు ఇచ్చారు. ఈ క్రమంలో రెండు వార్డుల్లో రూ.62.60 లక్షల మేర పను లకు మార్చి 25న జీవీ శంకుస్థాపనలు కూడా చేశారు. ఈ నేపథ్యంలో 31వ వార్డులో రూ.45 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం పనులను ప్రారం భించారు. ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న రోడ్డు సమస్య పనులు ప్రారంభంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి ఆంధ్రజ్యోతి చూపుతున్న చొరవను అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో మరెన్నో కార్యక్రమాలు చేపట్టి సమస్యల పరిష్కారానికి ఆంధ్రజ్యోతి కృషి చేయాలని స్థానికులు ఆకాంక్షించారు.





గాయత్రినగర్‌లో రూ.45 లక్షలతో జరుగుతున్న సీసీ రోడ్డు పనులు

తత్కాల్ బుకింగ్స్ సమయాల్లో ఎలాంటి మార్పులు లేవు

● సోషల్ మీడియా పోస్టులు నమ్మొద్దు ● ఐఆర్‌సీటీసీ స్పష్టీకరణ

గుంటూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15వ తేదీ నుంచి రైల్వే తత్కాల్ బుకింగ్స్ సమయాలు మారుతున్నాయంటూ గత కొన్ని రోజుల నుంచి సోషల్ మీడియా వేదికగా వైరల్ అవుతున్న పోస్టులలో ఎలాంటి వాస్తవం లేదని ఐఆర్‌సీటీసీ సంస్థ స్పష్టం చేసింది. ప్రస్తుతం ఏసీ తరగతుల బుకింగ్స్ నిత్యం ఉదయం 10 గంటలకు, స్లీపర్‌క్లాస్ రిజర్వేషన్ 11 గంటల నుంచి ప్రారంభమౌతున్నాయి. ప్రీమియం తత్కాల్ బుకింగ్‌కు ఎలాంటి ప్రారంభ సమయం లేదు. తత్కాల్‌తో పాటే ప్రీమియం తత్కాల్ కూడా బుకింగ్ చేసుకొనే అవకాశం ఉన్నది. అయితే రైల్వే శాఖ ఈ సమయాలు మారుస్తూ ఉదయం 10.30 గంటలకు ప్రీమియం తత్కాల్, 11 గంటలకు ఏసీ తరగతులు, మధ్యాహ్నం 12 గంటలకు స్లీపర్/సెకండ్ సిట్టింగ్ బుకింగ్స్‌ని అనుమతిస్తుందని సోషల్ మీడియాలో తెగ పోస్టులు పెట్టేస్తున్నారు. ఏప్రిల్ 15వ తేదీ మరో మూడు రోజుల్లోకి వచ్చేయడంతో రైలు ప్రయాణీకులంతా నిజమే కాబోలు అని భావిస్తున్నారు. అయితే ఐఆర్‌సీటీసీ సంస్థ అవన్నీ ఫేక్ పోస్టింగ్స్ అని స్పష్టం చేసింది. తత్కాల్ టిక్కెట్ల బుకింగ్స్‌లో ఎలాంటి మార్పులు చేయలేదని స్పందించింది. ఏజంట్లకు అనుమతించిన బుకింగ్ సమయాలు కూడా యథాతథంగా కొనసాగుతాయని పేర్కొన్నది. రైల్వే తత్కాల్ కోటా టిక్కెట్లకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. ఇందుకోసం రైల్వే ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ కౌంటర్ల వద్ద వేకువజాము నుంచే తాకిడి ఉంటుంది. అలానే ఐఆర్‌సీటీసీ ఏజంట్లకు ఒక్కో ప్యాసింజర్‌కి అదనంగా రూ. 100 చెల్లించి బుకింగ్ చేయించుకొంటుంటారు. ఐఆర్‌సీటీసీ పర్సనల్ ఐడీలు కలిగిన వాళ్లు కూడా ప్రయాణాల సమయంలో సాధారణ బుకింగ్స్ లభ్యం కాక పోతే ఐఆర్‌సీటీసీ ద్వారా తత్కాల కోటా టిక్కెట్లను బుకింగ్ చేసుకొంటుంటారు. ప్రీమియం తత్కాల్ కోటా టిక్కెట్లు అనేవి ప్రతీ టిక్కెట్‌కు ధర పెరుగుతూ పోతుంది. ఈ కారణంగా ఆ కోటాలో చాలా సందర్భాల్లో టిక్కెట్లు మిగిలిపోతాయి. వాటిని తత్కాల్ వెయిటింగ్‌లిస్టు టిక్కెట్లకు సర్దుబాటు చేస్తారు. ఈ కారణంగా తత్కాల్ టిక్కెట్ల బుకింగ్‌కు డిమాండ్ ఉంటుంది. వేజండ్ల, నంబూరు, పేరేచర్ల, న్యూగుంటూరు వంటి చిన్న రైల్వేస్టేషన్లలో తత్కాల్ కోటా బుకింగ్స్‌కు రద్దీ ఎక్కువగా ఉంటుంది.

ఈ నేపథ్యంలో యూట్యూబర్లు కొంతమంది వారి పోస్టులకు వ్యూయర్‌షిప్ పెంచుకోవడానికి తాజాగా ఈ తత్కాల్ బుకింగ్స్ సమయాన్ని రైల్వే శాఖ మార్చబోతున్నదని పేర్కొంటూ పోస్టింగ్ పెట్టారు. అంతేకాకుండా తేదీ కూడా ఈ నెల 15గా పేర్కొనేసరికి చాలామంది నిజమేనని నమ్మి ఆ పోస్టులను తెగ చూసేశారు. దీంతో యూట్యూబర్లకు కావాల్సినంత లైక్‌లు, వ్యూస్ వచ్చేశాయి. వారి లక్ష్యం నెరవేర్చుకొన్నారు. కాగా ఇలాంటి ఫేక్ పోస్టులు పెడుతూ తప్పుదోవ పట్టిస్తున్న సామాజిక మాధ్యమాల నిర్వాహకులపై రైల్వే, ఐఆర్‌సీటీసీ చర్యలు చేపట్టాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

వృద్ధురాలి హత్య కేసులో నిందితుల అరెస్టు

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పాత గుంటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆనందపేటలో జరిగిన వృద్ధురాలి హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు గుంటూరు ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ శుక్రవారం తెలిపారు. ఈనెల ఒకటో తారీఖున పాత గుంటూరులోని ఆనందపేటలో కర్రలతో, క్రికెట్ స్టంపులతో దాడి చేయడంతో షేక్ ఖాజాబీ అనే వృద్ధురాలు మృతి చెందింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న నాగేంద్రబాబు అలియాస్ సన్నీ, షేక్ ఆరిఫ్ లను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరపరిచినట్లుగా డీఎస్పీ పేర్కొన్నారు.

వైసీపీ నేతలు రాజకీయ నాయకులు కాదు... దొంగల సముహం!

●జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు

గుంటూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు రాజకీయ నేతలే కాదని, వారు పక్కాగా దొంగల సముహమని జిల్లా జనసేనపార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మండిపడ్డారు. శుక్రవారం లాడ్జి సెంటర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పోలీసులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా, పోలీసు శాఖను తీవ్రంగా అవమానించే విధంగా ఉన్నాయని గాదె విమర్శించారు. గత ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీకి గట్టిగా బుద్ధి చెప్పి 11 సీట్లకు పరిమితం చేసినా వైసీపీ నేతల తీరులో మార్పు రావడం లేదని తెలిపారు. జగన్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఆయన అవినీతికి సహకరించి అధికార దుర్వినియోగానికి పాల్పడి పలువురు ఉన్నతాధికారులు కోర్టులు, జైళ్ల చుట్టూ తిరుగుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. సోషల్ మీడియాను అడ్డు అదుపు లేకుండా రాజకీయ ప్రత్యర్థులను అసభ్య పదజాలంతో దూషిస్తూ దుర్వినియోగం చేసింది కూడా వైసీపీ నేతలేనని గాదె స్పష్టంచేశారు. వైఎస్ భారతిపై అసభ్యంగా మాట్లాడిన వ్యక్తిని కూటమి ప్రభుత్వం వెంటనే అరెస్ట్ చేసి జైలుకు పంపిందన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వం ఇలా ఎందుకు వ్యవహరించలేదని ఆయన నిలదీశారు. సమావేశంలో జనసేన కార్పోరేటర్ యర్రంశెట్టి పద్మావతి, నేతలు శిఖా బాలు, చట్టాల త్రినాద్, తాడికొండ కిషోర్ తదితరులున్నారు.



కల్యాణం.. వైభోగం



కళాకారుల నృత్యం

రఘువంశ రామయ్య.. సుగుణాల సీతమ్మ
వరమాలకై వేచె సమయాన..
శివధనువు విరిచాకె.. వధువు మది గెలిచాకె
మోగింది కల్యాణ శుభవేళ..
కల్యాణం.. వైభోగం.. శ్రీరామచంద్రుని కల్యాణం...

అన్నట్లుగా ఏకశిలానగరం పులకరించింది. శ్రీరామ నామస్మరణతో ఒంటిమిట్ట మార్మోగింది. ఆంధ్రా భద్రాద్రి, దక్షిణాది అయోధ్యగా పేరొందిన ఏకశిలానగిరి ఒంటిమిట్ట కోదండరామాలయంలో శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం నిండు వెన్నెలలో సీతారాముల కల్యాణాన్ని టీటీడీ ఆధ్వర్యంలో నభూతో నభవిష్యతి అన్న రీతిలో నిర్వహించారు. ముందుగా రామయ్యకు యజ్ఞోపవీతం, సీతమ్మకు స్వర్ణ కిరీటం కానుకగా అందించారు. ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులు అందించారు. స్వామివారి కల్యాణాన్ని చూసేందుకు భక్తులు విశేషంగా తరలి రావడంతో ఒంటిమిట్ట జనసంద్రంగా మారింది.



పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు

ఆలయ శిల్పకళను పరిశీలిస్తున్న సీఎం



ఎదుర్కోలు దృశ్యం

సీతారాముల కల్యాణం తిలకిస్తున్న చంద్రబాబు దంపతులు

విత్తనాల షాపుల్లో విస్తృత తనిఖీలు

గుంటూరు సిటీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా లోని విత్తనాల షాపుల్లో వ్యవసాయ శాఖ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు ఆదేశాల నేపథ్యంలో శుక్రవారం జరిగిన ఈ తనిఖీలలో కమిషనర్ కార్యాలయ సహాయ సంచాలకులు ఆర్.శశిధర్ రెడ్డి, ఏఓలు సురేషన్, ఖడ్గం రమణ కుమార్ పాల్గొన్నారు. జిల్లాలోని పత్తి విత్తనాల ప్రాసెసింగ్ యూనిట్లను, విత్తనాల షాపులను, పార్సిల్ కార్యాలయాలను అధికారులు తనిఖీ చేశారు. వివిధ పత్తి విత్తనాలు షాపుల్లో 65 బి.టి విత్తనాల నమూనాలను సేకరించారు. రికార్డులను కూడా ఈ సందర్భంగా పరిశీలించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	125, 134, 145
చికెన్ విత్ స్కిన్(కిలో)	236.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	246.00

రోడ్డు ప్రమాదంలో పురోహితుడు మృతి

వినుకొండటౌన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు డివైడర్ ఢీకొని పురోహితుడు మృతిచెందిన సంఘటన మండలంలోని పార్వతీపురం వద్ద గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలను ప్రకారం బొల్లాపల్లి గ్రామానికి చెందిన పురోహితుడు వెలమకన్ని వీరరాఘవశర్మ (36) వృత్తి రీత్యా ద్విచక్రవాహనంపై స్వగ్రామం నుంచి త్రిపురాంతకం వెళ్తుండగా పార్వతీపురం వద్ద డివైడర్ ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న హైవే సిబ్బంది అంబులెన్స్‌లో క్షతగాత్రుడిని వినుకొండ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో ప్రైవేటు వైద్యశాలకు తరలించగా అప్పటికే వీరరాఘవశర్మ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య యశ్వతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



పుష్‌కాట్‌లను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జ్ మేయర్ సజీలా, ఎమ్మెల్యేలు మాధవి, నసీర్, రామాంజనేయులు, కమిషనర్

స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దడంలో ప్రజలు భాగస్వాములు కావాలి

● ఇన్‌చార్జ్ మేయర్ షేక్ సజీల

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): గుంటూరును స్వచ్ఛ నగరంగా తీర్చి దిద్దుకోవడానికి జీఎంసీ చేస్తున్న కృషిలో నగర ప్రముఖులు, వివిధ వ్యాపార సంస్థలు భాగస్వాములు కావాలని నగర పాలక సంస్థ ఇన్‌చార్జి మేయర్ షేక్ సజీల పిలుపునిచ్చారు. తమిళనాడు మర్కంటైల్ బ్యాంకు నగరపాలక సంస్థకు అందించిన 50 పుష్‌కాట్స్‌ని కమిషనర్ పులి శ్రీనివాసులు, శాసన సభ్యులు నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, తమిళనాడు మర్కంటైల్ బ్యాంకు జీఎం అశోక్‌కుమార్‌తో కలిసి శుక్రవారం ప్రజారోగ్య కార్మికులకు అందించారు. ఇన్‌చార్జి మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్ఫూర్తితో గుంటూరును స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుకుంటామన్నారు. కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రముఖుల చేయూత ద్వారా నగరంలో మరింత వేగంగా అభివృద్ధి, స్వచ్ఛత కార్యక్రమాలు విరివిగా చేపడతామన్నారు. తూర్పు ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న గుంటూరు నగరంలో మౌలిక వసతుల కల్పనకు తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్ వంటి సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులు మాట్లాడుతూ తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్ అందించిన పుష్ కాట్స్ గుంటూరును స్వచ్ఛ నగరంగా మార్చుకోవడానికి తోడ్పడతాయన్నారు. తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్ జనరల్ మేనేజర్ మాట్లాడుతూ బ్యాంక్ ద్వారా రానున్న కాలంలో కూడా తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

నగరంలో 35 చలివేంద్రాలు ఏర్పాటు

వేసవిలో ప్రయాణికులకు, ప్రజలకు దాహం తీర్చేందుకు గుంటూరు నగరంలో 35 చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి మేయర్ షేక్ సజీల తెలిపారు. హిందూ కాలేజీ జంక్షన్‌లో శుక్రవారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యే గళ్లా మాధవితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఈఈ మధుసూదన్, ఏఈ ప్రసాద్ పాల్గొన్నారు.

మెరుగైన పారిశుధ్యానికి చర్యలు తీసుకోవాలి

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో చెత్త డంపింగ్ పాయింట్‌లు లేకుండా మెరుగైన పారిశుధ్య పనులు జరిగేలా ప్రజారోగ్య కార్యదర్శులు, అధికారులు బాధ్యత తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. కమిషనర్ బ్రాడీపేట, కోబాల్ట్ పేట, గోరంట్ల, అన్నపూర్ణ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి, పారిశుధ్య పనులను శుక్రవారం పరిశీలించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కంకరగుంట ఆర్‌యూబీ దగ్గర విస్తరిస్తున్న రోడ్డు పనులను పరిశీలించి పనులను వేగంగా చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఇంజనీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సెలవు రోజుల్లోనూ పని చేయనున్న జీఎంసీ క్యాష్ కౌంటర్లు

ఆస్తి పన్నుదారులకు సౌలభ్యంగా జీఎంసీ ప్రధాన కార్యాలయంలో 8, సర్కిల్ కార్యాలయంలోని 6 ట్యాక్స్ కలెక్షన్ కౌంటర్లు శనివారం, ఆదివారం, సోమవారం సెలవు రోజులైనప్పటికీ ప్రతి రోజు ఉదయం 7 నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేస్తాయని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఆస్తి పన్నును ఏప్రిల్ 30 నాటికి ఏక మొత్తంగా చెల్లించిన వారికి ఆస్తి పన్నులో 5 శాతం రాయితీ లభిస్తున్నందున నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



శాంతియుత ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే నసీర్, ముస్లింలు

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

● ముస్లింల శాంతియుత ధర్నా

గుంటూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పార్లమెంటులో ఆమోదించిన వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ముస్లిం ఐక్యవేదికతో పాటు ఉలేమాలు, ఆల్ ఇండియా పర్సనల్ లా బోర్డు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పలువురు ముస్లిం మైనార్టీ నాయకులు శుక్రవారం శాంతియుత ధర్నాకు దిగారు. నగరంలోని మాయబజార్ కింగ్ హోటల్ సెంటర్‌లో జరిగిన ధర్నాకు తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్ కూడా సంఘీభావం ప్రకటించారు. శుక్రవారం మధ్యాహ్నం నమాజ్ అనంతరం ముస్లింలు పెద్ద ఎత్తున సెంటర్‌కు చేరుకొని నిరసన తెలిపారు. ముస్లింలతో పాటు మైనార్టీ నాయకులైన మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి, వైసీపీ నగర అధ్యక్షురాలు షేక్ నూరిఫాతిమా, జియావుర్ రెహమాన్, షేక్ షౌకత్, ముస్లిం ఐక్య వేదిక నాయకులు షేక్ బాజీలు హాజరై నిరసన తెలిపారు. ముస్లింల ఆస్తుల రక్షణకు ఏర్పాటు చేసిన వక్ఫ్ చట్టాన్ని నీరు గార్చేలా వక్ఫ్ సవరణ బిల్లును ప్రవేశపెట్టటం రాజ్యాంగ ఉల్లంఘనేనని నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బిల్లును ఉప సంహరించుకొని సవరణను రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు టోపీ బాబు, షేక్ ఖాజా, మునీర్, నయిమ్, అవాజ్ కమిటీ నాయకులు చిష్టీ ఉన్నారు.

ఆర్‌కేవీవై కింద సబ్సిడీపై డ్రోన్ల పంపిణీ

● జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు

గుంటూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ కృషీ వికాస్ యోజన(ఆర్‌కేవీవై) పథకం కింద రైతుల గ్రూపులకు 80 శాతం సబ్సిడిపై విల్లాజి ఫారం మెషినరీ బ్యాంకులు ద్వారా కిసాన్ డ్రోన్లను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సరఫరా చేసే డ్రోన్ల నమూనాలను రైతుల అవగాహన కోసం శుక్రవారం కృషీ భవన్‌లో ప్రదర్శించారు. డీఏవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులు డ్రోన్ల వినియోగంతో సమయం ఆదా చేసుకోవచ్చన్నారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రత్నమహిపాల్ రెడ్డి మాట్లాడుతూ రైతులు డ్రోన్లను కొనుగోలు చేసేందుకు రుణ సదుపాయాన్ని సత్వరం ఇప్పించేందుకు అన్ని బ్యాంకులకు మార్గదర్శకాలు జారీ చేస్తానన్నారు. డ్రోన్ తయారీ కంపెనీ ప్రతినిధులు రవికుమార్, సుధీర్‌లు రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమానికి యూనియన్, స్టేట్ బ్యాంకుల అధికారులు, జిల్లా సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ప్రతినిధులు, అగ్రోస్, అన్ని మండలాల వ్యవసాయ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు, డిస్ట్రిక్ట్ రిసోర్స్ సెంటర్ అధికారులు హాజరయ్యారు.

గోపాల మిత్ర లకు నూతన జాబ్ చార్ట్

గుంటూరు సిటీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : గోపాల మిత్రలకు ప్రభుత్వం నూతన జాబ్‌చార్ట్‌ను అమల్లోకి తెచ్చిందని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఓ నరసింహారావు తెలిపారు. పశుపోషకులకు సంబంధించిన గేదెలు, ఆవులకు కృత్రిమ గర్భధారణను వారికి కేటాయించిన గ్రామాలలో రైతు ఇంటి వద్దనే చేయవలెనని, ఆ పశువులు అన్నింటికి చూడి పరీక్షలు నిర్ధారణ చేసి భారత్ పశుదాన్ అనే యాప్‌లో అదే రోజు వివరాలను పొందుపరచాలన్నారు. వారికి కేటాయించిన గ్రామాలలో గేదెలు, ఆవులు రెండు సార్లు కన్నా ఎక్కువగా తిరగకట్టినచో అటువంటి పశువులను పశు వైద్యాధికారి ద్వారా చికిత్స అందించి, ఆ పశువు చూడి ది అయ్యేటట్లుగా బాధ్యత తీసుకొనవలెనని అన్నారు. ప్రతి నెల దూడల పుట్టుకను భారత్ పశుదాన్ యాప్‌లో నమోదు చేయవలెనని అన్నారు.

మహిళా విద్యకు కృషి చేసిన మహనీయుడు పూలే

● ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి

గుంటూరు,(తూర్పు), ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మహిళా విద్యకు మహాత్మ జ్యోతిరావుపూలే చేసిన కృషి ఎనలేనిదని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి కొనియాడారు. కలెక్టరేట్, ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిబా పూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఏ భార్గవ్‌తేజ, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, నసీర్ అహ్మద్, బూర్ల రామాంజనేయులు, నగర ఇన్‌చార్జ్ మేయర్ సజీలా, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు డీ ఆర్వో ఖాజావలి, బీసీ సంక్షేమ శాఖ మయూరి తదితరులు పాల్గొని మహాత్మ జ్యోతిబా పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. హిందూ కళాశాల సెంటరులో మహాత్మ జ్యోతిబా పూలే, సావిత్ర బాయి పూలే దంపతులు విగ్రహాలను సర్కిల్ ఏర్పాటు చేసేలా రానున్న కౌన్సిల్‌లో తీర్మానం చేసి పనులు ప్రారంభించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గౌడ, నాయి బ్రాహ్మణ, వాల్మీకీ, బోయ, ఏపీ మాదిగ కార్పోరేషన్ డైరక్టర్లు శైలజ, మద్దిరాల గంగాధరరావు, బొప్పన వెంకటేశ్వర్లు, కంభంపాటి శిరీషా, మాదిగ కో ఆపరేటివ్ సొసైటీ డైరక్టర్ సురేష్, ఏపీ టిడ్కో డైరక్టర్ నాగేశ్వరి, సౌత్ సెంట్రల్ రైల్వే జోన్ బోర్డు సభ్యుడు అంగిరేకుల వరప్రసాదు, బీసీ సంఘం నాయకులు కేసన శంకరరావు, సీనియర్ న్యాయవాది వై కోటేశ్వరరావు (వైకే), తాడికొండ నరిసింహరావు, బసవేశ్వరరావు, బోడే నాగమణి, కోల్లు నాగేశ్వరరావు పాల్గొన్ని పూలే చేసిన సేవలను కొనియాడారు. అనంతరం బీసీ కార్పోరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకాల ఏర్పాటుకు 400 మంది లబ్ధిదారులకు సబ్సిడీతో మంజూరు చేసిన రుణాలు రూ.13,08,00,000 చెక్కును ప్రజా ప్రతినిధులు అందజేశారు.

మహాత్మ జ్యోతిబా పూలే జయంతిని పురస్కరించుకుని స్థానిక హిందు కళాశాల కూడలిలోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, ఇన్‌చార్జ్ మేయర్ సజీలా, నగర కమిషనరు పులి శ్రీనివాసులు, డీఆర్వో ఎస్ఎస్‌కే ఖాజావలి, బీసీ సంక్షేమ శాఖ డీడీ కే మయూరి, ఆర్డీవో శ్రీనివాసులు, రాష్ట్ర కార్పోరేషన్ డైరక్టర్లు, బీసీ సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

కౌన్సిల్ సమావేశ మందిరంలో...



కార్పొరేషన్ లో జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జ్ మేయర్, ఎమ్మెల్యేలు, కమిషనర్, కార్పొరేటర్లు

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : అణగారిన వర్గాల అభివృద్ధికి తన జీవితాన్ని అంకితం చేసిన మహాత్మా జ్యోతిరావు పూలె 199వ జయంతి సందర్భంగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో అయన చిత్ర పటానికి ఇన్‌చార్జి మేయర్ షేక్ సజీల, కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, అధికారులు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పూలమాలలు వేసి శుక్రవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు, విభాగాధిపతులు తదితరులు పాల్గొన్నారు.

నగరపాలెం ట్రావెల్స్ బంగ్లాలో...

గుంటూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతీరావ్‌పూలే తన జీవిత సర్వస్వాన్ని బడుగులకే అంకితం చేశారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. నగరపాలెం ట్రావెల్స్ బంగ్లా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో శుక్రవారం ఆమె పాల్గొని ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ గుంటూరులో ఒక ఐలాండ్ నిర్మించి అందులో సావిత్రిబాయి పూలే, జ్యోతిరావు పూలే విగ్రహాలు ఏర్పాటు చేయటానికి త్వరలోనే కౌన్సిల్‌లో ఒక తీర్మానం చేయబోతున్నామన్నారు. త్వరలోనే బీసీ భవన్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు.

● పూలే జయంతి సందర్భంగా గుంటూరు తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే నసీర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల జీవితాల్లో వెలుగు నింపేందుకు పూలే చేసిన సేవలు శ్లాఘనీయమని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎల్లావుల అశోక్, వేములకొండ శ్రీను, ఏడుకొండలు, వాణి, దయారత్నం, గొడుగు శంకర్, బత్తిని శంకర్, సూరే శ్రీను, అల్లం బాజీ, వెంకట్, అచ్చి కిరణ్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

● గుంటూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): భారతీయ సామాజిక వేత్త జ్యోతిరావుపూలే కుల వ్యతిరేక ఉద్యమంతో బడుగు, బలహీన వర్గాల ప్రజల్లో ఆత్మస్థైర్యం కల్పించిన ధీరుడని టీడీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం పూలే జయంతి నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ అంటరానితనం నిర్మూలన, మహిళాభ్యున్నతి, బీసీల అభివృద్ధి కోసం పాటుపడిన ఏకైక శక్తి పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో సుఖవాసి శ్రీనివాసరావు, సింహాద్రి కనకాచారి, మల్లె ఈశ్వరరావు, ఏసుబాబు, మాదాల చినకొండలరావు, గట్టి శ్రీనివాస్, జంపని నాగేశ్వరావు, బొబ్బిలి రామారావు, గొడుగు శంకర్, బెల్లంకొండ సురేష్, షేక్ చిన్నబాజి, మన్నవ కోటేశ్వరరావు, గుంటి సతీష్, ఇత్తడి పున్నారావు తదితరులు పాల్గొన్నారు.

● గుంటూరు సిటీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని పరిషత్ చైర్మన్ కత్తెర హెని క్రిస్టినా నిర్వహించారు సమావేశానికి మహిళా ఉద్యోగిని టి.ఉషాదేవి అధ్యక్షత వహించారు. చైర్ పర్సన్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ మహిళల హక్కుల కోసం ఆయన ఎంతో పోరాటం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈఓ జ్యోతిబసు, డిప్యూటీ సీఎం కృష్ణ, అకౌంట్ ఆఫీసర్ శామ్యూల్ పాల్, పంచాయతీరాజ్ ఉద్యోగ సంఘ నాయకుడు డాక్టర్ కూచిపూడి మోహన్, ఏవో రత్నబాబు ప్రసంగించారు.



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న కేసన శంకరరావు, జూపూడి తదితరులు

● గుంటూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సమసమాజ స్థాపనకు మహాత్మా జ్యోతిరావు పూలే తన జీవితాన్ని త్యాగం చేశారని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. హిందూ కళాశాల సెంటర్‌లో పూలే విగ్రహానికి పూలమాలతో ఆయన నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ రజక జన సేవా సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు, ఇతర నాయకులు హిందూ కళాశాల సెంటర్‌లో పూలే విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు జీఆర్ భగత్‌సింగ్, తాటికొండ నరసింహరావు, ఊమని ఉమామహేశ్వరరావు, లింగాల వెంకటసాయియాదవ్, వీరవల్లి శ్రీనివాసరావు, వలివేటి శ్రీనివాసరావు పలువురు నాయకులున్నారు.

● గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడిపేట విజ్ఞానకేంద్రం కార్యాలయంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.నేతాజి అధ్యక్షతన జరిగిన కార్యాక్రమంలో గుఱ్ఱం జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు శుక్రవారం పూలే చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. వై.నేతాజి మాట్లాడుతూ నాటి మనువాదానికి వ్యతిరేకంగా శ్రామిక ప్రజలను పూలే చైతన్యం చేశారన్నారు. కార్యక్రమంలో కె.నళినీకాంత్, బి.లక్ష్మణరావు, బి.ముత్యాలరావు, ఎస్.కె.సమీర్, ఎమ్.కిరణ్, వై.కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

● గుంటూరు(విద్య), ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా శుక్రవారం హిందూ కాలేజీ కూడలి వద్ద పూలే విగ్రహానికి పూలమాలవేసి యూటీఎఫ్ జిల్లా కమిటీ నాయకులు నివాళులర్పించారు. యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాలకు, మహిళలకు విద్యను అందించడానికి కృషి చేసి పూలే మార్గదర్శిగా నిలిచారన్నారు. రాష్ట్ర ప్రచురణ కమిటీ చైర్మన్ ఎం.హనుమంత రావు రాష్ట్ర కౌన్సిలర్ శివ పూర్ణయ్య జిల్లా కార్యదర్శులు గోవిందు, బి. ప్రసాదు, ఆదినారాయణ ఆడిట్ కమిటీ సభ్యులు కోటిరెడ్డి, ధన రాజారావు పాల్గొన్నారు.

● గుంటూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా జ్యోతి రావు పూలే గొప్ప సంఘ సంస్కర్త అని ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. ఈ మేరకు జ్యోతీరావు పూలే జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ మహిళా విద్య ప్రాముఖ్యత తెలియజేస్తూ, వితంతు పునర్వివాహం గురించి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) రమణమూర్తి, అడ్మిన్ అదనపు ఎస్పీ హనుమంతు, అద్దంకి. వెంకటేశ్వరరావు, అశాహరి శ్రీనివాసరావు, నరసింహారావు, వెల్ఫేర్ శివరామ కృష్ణ , ఇతర పోలీసు అధికారులు, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది, ఇతర విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

పూలే జయంతి నేపథ్యంలో చలివేంద్రం ఏర్పాటు

గుంటూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా టీడీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ నాయకుడు, ప్రజావైద్యశాల చైర్మన్ డాక్టర్ నిమ్మల శేషయ్య గుజ్జనగుండ్ల సెంటర్లోని ప్రజావైద్యశాల ఆవరణలో శుక్రవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండాకాలంలో పేదప్రజల దాహార్తిని తీర్చడానికి డాక్టర్ నిమ్మల శేషయ్య చారిటబుల్ ట్రస్ట్ తరుపున నాలుగేళ్లగా చలివేంద్రం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ చలివేంద్రం మూడు నెలల పాటు ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్, కొమ్మినేని కోటేశ్వరరావు, సింగంశెట్టి వీరయ్య, షేక్ రుస్తుం బాబు, డాక్టర్ ఎన్. పవన్ కుమార్, డా. ఎన్.నిహారిక, డా.ఎస్.శివశంకరయ్య, టీడీపీ నాయకులు, పాల్గొన్నారు.



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నిమ్మల శేషయ్య

బిడ్‌లు 43... అర్హత పొందినవి 6

● అందరూ టన్ను రూ. 110కే లోడింగ్ చేస్తామని ప్రతిపాదన

● లాటరీ నిర్వహించి ఏజెన్సీని ఖరారు చేసిన ఇన్‌ఛార్జ్ కలెక్టర్

గుంటూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గుండిమెడ రీచ్‌లో ఇసుక తవ్వకం, నిర్దేశిత స్టాక్ పోయింట్లలో లోడింగ్ నిమిత్తం జిల్లా స్థాయి ఇసుక కమిటీ నిర్వహించిన టెండర్లలో పలు ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ రీచ్ మొత్తం విస్తీర్ణం 4,930 హెక్టార్లుగా ఉన్నది. 34,505 క్యూబిక్ మీటర్లు(51,758 మెట్రిక్ టన్నుల) ఇసుక నిల్వలు ఉన్నట్లు భూఅంక్షాశాల ద్వారా మైనింగ్ అధికారులు లెక్కించారు. దీనికి పర్యావరణ అనుమతులు కూడా లభించాయి. వచ్చే ఏడాది మార్చి 26వ తేదీ వరకు ఇసుక తవ్వకాలకు అనుమతి ఉండటంతో ఈ నెల 4వ తేదీన డీఎల్ఎస్‌సీ షార్టు నోటీసు ఇచ్చి బిడ్లను ఆహ్వానించింది. మొత్తం 43 సంస్థలు/కాంట్రాక్టర్లు ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం 3 గంటల లోపు దాఖలు చేశారు. వీటిని శుక్రవారం ఇన్‌చార్జ్ కలెక్టర్ అమిలినేని భార్గవతేజ సమక్షంలో కలెక్టరేట్‌లోని డీఆర్‌సీ మీటింగ్ హాల్‌లో ఓపెన్ చేశారు. కాగా టెండర్‌లో పేర్కొన్న నిబంధనల మేరకు కేవలం ఆరు సంస్థలకే సాంకేతిక బిడ్‌లో అర్హత లభించింది. అయితే ఈ ఆరు సంస్థలు కూడా తాము టన్ను రూ.110కే తవ్వకం, లోడింగ్ చేస్తామని బిడ్ దాఖలు చేయడం అందరిని ఆశ్చర్యానికి గురి చేసింది. కాంట్రాక్టర్లు సిండికేట్ అయి ఇలా చేశారానన్న అనుమానాలు కూడా తలెత్తాయి. దీంతో లాటరీ పద్ధతిన కాంట్రాక్టర్‌ని ఇన్‌చార్జ్ కలెక్టర్ ఎంపిక చేసే ప్రక్రియని అందరి సమక్షంలో నిర్వహించారు. జతిన్ మినరల్స్ అనే సంస్థ లాటరీలో ఎంపిక అయినట్లు ఇన్‌చార్జ్ కలెక్టర్ శుక్రవారం రాత్రి ప్రకటించారు.

ఓటరు కార్డుల్లో డోరు నంబర్లు స్పష్టంగా ఉండాలి

● రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో డీఆర్‌వో ఖాజావలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌వో ఖాజావలి

గుంటూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఓటరు కార్డులకు డోర్ నంబర్లు సక్రమంగా ఉండేలా పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ఎస్‌కే ఖాజావలి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ శంకరన్ హాల్‌లో శుక్రవారం ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. డీఆర్‌వో మాట్లాడుతూ రానున్న ఎస్ఎస్ఆర్-2026 కంటే ముందుగానే పైలట్‌గా పట్టణాల్లో ఒక పోలింగ్ బూత్‌లో ఓటర్లను డోర్ టూ డోర్ పరిశీలన చేసి ఒకే కుటుంబ సభ్యులు ఒకే పోలింగ్ బూత్‌లో ఉండేలా పరిశీలన చేయాలన్నారు. ఓటరు కార్డు ఆధార్ కార్డుకు అనుసంధానం అంశంపై ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ పోలింగ్ బూత్‌లు పెంచడానికి చర్యలు తీసుకోవాలని, నియోజకవర్గ స్థాయిలోనే కాకుండా మండల స్థాయిలో కూడా అన్ని రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించా లని కోరారు. ఈ సమావేశంలో డాక్టర్ తాతా సేవకుమార్(ఆప్), వాసు(బీఎస్‌పీ), వై వీ సుబ్బారావు(బీజేపీ), బిళ్లా సునీల్ కుమార్(కాంగ్రెస్), టీడీపీ నుంచి కంచర్ల శివరామయ్య, ఓంకార్, సీహెచ్ త్రినాధ్ రావు(జనసేన), కే.ప్రేమ్ కుమార్(వైసీపీ), ఈఆర్వోలు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీ కుమారి, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, ఏఈఆర్‌ఓలు జీయంసీ అదనపు కమిషనర్ ఓబులేశు, డిప్యూటీ కమిషనర్లు డీ శ్రీనివాస రావు, సీహెచ్ శ్రీనివాస రావు, ప్రత్తిపాడు, తెనాలి, మంగళగిరి, పొన్నూరు తహసీల్దార్లు కరుణ కుమార్, గోపాలకృష్ణ, దినేష్ రాఘవేంద్ర, జియా ఉల్ హక్, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ మల్లేశ్వరి పాల్గొన్నారు.

జనం లాగి తంతే జగన్‌కు 11 సీట్లు వచ్చాయి

● పశ్చిమ ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌రెడ్డిని ప్రజలు లాగి తంతేనే ఆయన 11 సీట్లకు పరిమితమయ్యారని ఎమ్మెల్యే గళ్లా మాధవి ఎద్దేవా చేశారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన పూలే జయంతి వేడుకలకు హాజరైన ఆమె అనంతరం విడిగా మీడియాతో మాట్లాడారు. జగన్‌రెడ్డి తన స్థాయిని దిగజార్చుకుని చిల్లర రాజకీయ విమర్శలు చేస్తున్నారని, గోరంట్ల మాధవ్, కొడాలి నాని, రోజాలాగా జగన్ మారిపోయారని ఎద్దేవా చేశారు. అధికారం లేకపోయేసరికి జగన్‌కు మతి భ్రమించిందని విమర్శించారు. పక్కన తంతే పక్కన పడతారు.. వార్ వన్‌సైడ్ అంటూ జగన్ పగటి కలలు కంటున్నారని ఎమ్మెల్యే మాధవి ఎద్దేవా చేశారు. వైసీపీ మరో మూడు దఫాల ఎన్నికల్లో గెలిచే ప్రసక్తి లేదని తేల్చి చెప్పారు.

మెగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

గుంటూరు నల్లపాడు రైల్వే గ్రౌండ్స్‌లో పరుచూరి వీర రాఘవరావు మెమోరియల్ ఆధ్వర్యంలో జరుగుతున్న మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే గళ్లా మాధవి, ఇన్‌చార్జి మేయర్ షేక్ సజీల ప్రారంభించారు. తొలుత వారిరువురు క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఐదు రోజులపాటు జరిగే ఈ మెగా టోర్నమెంట్‌కు దాదాపు 70 టీమ్‌లు పాల్గొనబోతున్నాయి.

బూతుల సంస్కృతిని తెచ్చింది వైసీపీనే : కనపర్తి



కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాల్లో బూతుల సంస్కృతికి నాంది పలికింది వైఎస్ జగన్మోహనరెడ్డే నని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు విమర్శించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సొంత బాబాయి, తోడబుట్టిన చెల్లిపై వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డ చరిత్ర హీనుడు జగన్ అని మండిపడ్డారు. భారతీరెడ్డికి ప్రత్యేక రాజ్యాంగం లేదని, భువనేశ్వరి, వంగలపూడి అనిత, పంచుమర్తి అనురాధ కూడా మహిళలే అన్న విషయం వైసీపీ నాయకులు గుర్తుంచుకోవాలన్నారు. చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్, కుటుంబ సభ్యులపై సభ్య సమాజం తలదించుకునేలా మాట్లాడిన వైసీపీ నేతలు కొడాలి నాని, అంబటి, అనిల్, రోజారెడ్డి, వంశీ, పోసాని కృష్ణ మురళి, బోరుగడ్డ అనిల్, వర్రా రవీందర్ రెడ్డి, ద్వారంపూడి తదితరులపై ఎప్పుడైనా కేసు పెట్టి వారిని అరెస్టు చేయించారా అని ప్రశ్నించారు. రాజకీయ నిరుద్యోగిగా ఉన్న గోరంట్ల మాధవ్ పోలీసు రక్షణలో ఉన్న చేబ్రోలు కిరణ్‌పై దాడి చేసి చంపేస్తానని మాట్లాడటం వైసీపీ డీఎన్‌ఏని తెలియజేస్తుందని అన్నారు. జగన్‌రెడ్డి మెప్పుకోసం తమ పార్టీ కార్యకర్తలపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. సమావేశంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లెద్దుల సుశీలరావు పాల్గొన్నారు.

వీఆర్ స్కూల్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

గుంటూరు(విద్య),ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): స్థానిక పాతగుంటూరులోని విఆర్ స్కూల్‌లో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రీ ప్రైమరీ పూర్తిచేసుకుని ఒకటవ తరగతిలో చేరుతున్న విద్యార్థులకు, 5వ తరగతి పూర్తిచేసుకుని 6వ తరగతిలో చేరే విద్యార్థులకు వేడుకలు నిర్వహించినట్లు డైరెక్టర్ వంగా వెంకటేశ్వరరావు, కార్యదర్శి రమాదేవి తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులకు మెడల్స్‌తోపాటు సర్టిఫికెట్లు అందజేశారు. మెరుగైన బోధనతోపాటు ఉత్తమ పౌరుల్ని తయారు చేయడమే లక్ష్యమని డైరెక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు కార్యక్రమంలో నరేంద్ర హర్ష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

ముందుచూపుతో శంకర్‌విలాస్ బ్రిడ్జి నిర్మించాలి

● సీపీఎం నగర కార్యదర్శి నళినికాంత్

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ముందుచూపు లేకుండా శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మించడం సరైనది కాదని సీపీఎం నగర కార్యదర్శి కే నళినికాంత్ అన్నారు. స్థానిక బ్రాడీపేట, సీపీఎం కార్యాలయంలో శుక్రవారం 'విజనరీ లీడర్ ప్రభుత్వంలో ముందు చూపులేని శంకర విలాస్ బ్రిడ్జి నిర్మాణమా?" చేయాలనే కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం అయన మాట్లాడుతూ గతంలో చెప్పినట్లు శంకర్ విలాస్ బ్రిడ్జి పొడవు కుదించకుండా నిర్మించాలని అన్నారు. ముందుగా ఆర్‌యూబీ నిర్మించడం ద్వారా రాకపోకలకు అంతరాయం లేకుండా చేయొచ్చని తెలిపారు. కార్యక్రమంలో బి ముత్యాలరావు, షేక్ ఖాశిం షహీద్, ఆది నికల్సన్ పాల్గొన్నారు.

మహిమకరంగా కృపా మహాసభలు



ప్రార్థన చేస్తున్న మాథ్యూస్

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): స్థానిక హౌసింగ్ బోర్డు ఎదుట కృపా మినిస్ట్రీస్ 19వ అంతర్జాతీయ కృపా మహాసభలు రెండో రోజు దేవునికి మహిమకరంగా జరిగాయి. బొంబాయి, చెన్నైకు చెందిన పాస్టర్లు గాంధీ, జాన్ బాబు మాట్లాడుతూ దేవుని ప్రేమ అమూల్యమైనదని ఈ లోకంలో ఆయన ప్రేమకు సాటి లేదని తెలిపారు. క్రీస్తును ఆరాధించే వారికి దైవ జ్ఞానం పరిశుద్ధత ఆత్మఫలములు దేవుడు అనుగ్రహిస్తాడని కృపా మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు మాథ్యూస్ సందేశ మిచ్చారు. పాస్టర్ వి.రమేష్ బాబు ముగింపు ప్రార్థన ఆశీర్వాదాలను అందించారు. సభల్లో మాజీ మంత్రి డొక్కా మాణిక్యవర ప్రసాదు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో సీతారామయ్య హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): డ్రీమ్ వర్క్ ఆర్ట్ గ్యాలరీ, అనంత డైమండ్స్ కేఎల్ యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహించిన జాతీయస్థాయి చిత్రలేఖనం ప్రదర్శన వర్క్ షాప్‌లో శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల కరస్పాండెంట్, సెక్రటరీ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. 10వ తరగతి విద్యార్థి డి.మోహన్ కుమార్, 5వ తరగతి విద్యార్థిని కామాక్షికి బెస్ట్ చిల్డ్రన్ అవార్డు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఉత్తమ శిక్షణ ఇచ్చిన డ్రాయింగ్ టీచర్ వి.హేమలతకు బెస్ట్ టీచర్ అవార్డు తో పాటు బెస్ట్ స్కూల్ అవార్డు అందుకున్నట్లు తెలిపారు. స్పాట్ పెయింటింగ్ పోటీలో ఎస్.కమల, ఎం.ఝాన్సీకి ఉత్తమ కళాశిక్షకురాలు బహుమతులు పొందారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ళ కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ పార్వతీదేవి, కోఆర్డినేటర్స్ డి.దుర్గా శ్యామ్, పి.శ్రీదేవి విద్యార్థులను అభినందించారు.

ప్రజా ఉద్యమ కార్యకర్తలకు దిక్సూచి విశ్వ మోహన్ రెడ్డి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రచయితలకు, ప్రజా ఉద్యమ కార్యకర్తలకు దిక్సూచి కొమ్మిరెడ్డి విశ్వ మోహన్ రెడ్డి అని ప్రజా ఉద్యమాల న్యాయవాది, ఓపీడీఆర్ నాయకుడు వెంకటేశ్వర రెడ్డి అన్నారు. ప్రజా రచయిత కొమ్మిరెడ్డి విశ్వ మోహన్ రెడ్డి రచనలను, ఆయన జీవితాన్ని పరిచయం చేస్తూ జ్వాలాశిఖ విశ్వ మోహన్ పేరుతో జనసాహితి ప్రచురించిన పుస్తక పరిచయ సభ స్థానిక బృందావన్‌గార్డెన్స్, సీనియర్ సిటిజన్స్ సేవా కేంద్రంలో జరిగింది. విరసం నాయకులు నల్లూరి రుక్మిణి మాట్లాడుతూ కల్పిత కథనాలకు దూరంగా, వాస్తవ జీవితమే వస్తువుగా పుంఖాను పుంఖాలుగా నవలలు వ్రాసి, ఏమాత్రం గుర్తింపు కోరుకోని విశ్వ మోహన్ రెడ్డి అని అన్నారు. ప్రజాసాహితి సంపాదకుడు పిఎస్ నాగరాజు, ప్రముఖ రచయిత కాట్రగడ్డ దయానంద్, అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, జనసాహితి అధ్యక్షుడు దివి కుమార్ ప్రసంగించారు. ఈ సభకి జనసాహితి ప్రధాన కార్యదర్శి అరుణ అధ్యక్షత వహించారు.



జీజీహెచ్‌లో అత్యాధునికంగా.. ఎంసీహెచ్ బ్లాక్

గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో తుది దశకు చేరిన ఎంసీహెచ్ బ్లాక్

- రూ.86 కోట్ల వ్యయం.. 600 పడకలు.. 9 ఓటీలు
- ఎన్నారై వైద్యుల విరాళాలతో జీజీహెచ్‌లో నిర్మాణం
- ఏడాది చివరికి సిద్ధం.. జనవరిలో సీఎంచే ప్రారంభం

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ వైద్య బోధన ఆసుపత్రిలో రూ.86 కోట్లతో అత్యాధునిక రీతిలో మెటర్నిటీ అండ్ చైల్డ్ హెల్త్(ఎంసీహెచ్) బ్లాక్ రూపు దిద్దుకుంటోంది. గుంటూరు వైద్య కళాశాలలో విద్యను అభ్యసించి ఉత్తర అమెరికాలో స్థిరపడిన ఎన్నారై వైద్యులు ఈ భవనానికి అయ్యే ఖర్చు మొత్తాన్ని విరాళంగా అందజేస్తున్నారు. అమెరికాలోని చికాగో, న్యూయార్క్, లాస్‌ఏంజెల్స్, టెక్సాస్ తదితర నగరాల్లో పేరుగాంచిన శిశు వైద్యశాలలను పరిశీలించి, గుంటూరు జీజీహెచ్‌లో ఈ ఎంసీహెచ్ బ్లాక్ డిజైన్‌ను రూపొందించడం విశేషం. ఆధునిక సౌకర్యాలతో సెల్లార్, జీ ప్లస్ ఫైవ్ భవనంగా ఇది రూపుదిద్దుకుంటోంది. ఇందులో 600 పడకల సామర్థ్యంతో పీడియాట్రిక్, గైనకాలజీ విభాగాలు ఏర్పాటు చేస్తున్నారు. శిశు వైద్యానికి 300 పడకలు, ప్రసూతి విభాగానికి 300 పడకలు కేటాయించారు. ప్రస్తుతం సివిల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనులు దాదాపు పూర్తయ్యాయి. మార్బుల్ ఫ్లోరింగ్ పనులు జరుగుతున్నాయి. 80 శాతం పనులు పూర్తికావడంతో.. 2026 జనవరిలో సీఎం చంద్రబాబుచే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎంసీహెచ్ బ్లాక్‌కు రూ.35 కోట్లతో ఆధునిక వైద్య పరికరాలు అందజేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

అత్యాధునిక శైలి.. ఆధునిక పరిజ్ఞానం

స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ ప్రమాణాలతో ఎంసీహెచ్ బ్లాక్‌ను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మిస్తున్నారు. అమెరికాలో పలు శిశు వైద్యశాలలను పరిశీలించి అక్కడి వైద్యులతో చర్చించి రూపొందించిన ఈ ఎంసీహెచ్ బ్లాక్ డిజైన్‌ను భారత నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) మార్గదర్శకాలకు అనుగుణంగా తీర్చిదిద్దారు. గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు మొదటి, రెండు అంతస్తులను స్త్రీ, ప్రసూతి విభాగానికి కేటాయించారు. మూడు, నాలుగు, ఐదు ఫ్లోర్లను శిశు వైద్య విభాగంతో పాటు ఎన్ఐసీయూ, పీఐసీయూ వార్డులకు కేటాయించారు. సెంట్రల్ ఎయిర్ కండీషన్డ్‌గా నిర్మిస్తున్న ఈ భవనంలో ప్రతి వార్డులో మానిటర్లు, ఆక్సిజన్ ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఎనిమిది లిఫ్టులు ఏర్పాటు చేస్తున్నారు. స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ ప్రమాణాలతో అత్యాధునిక ల్యామినార్ ఎయిర్ ఫ్లో ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు చేస్తున్నారు. వైద్య విద్యార్థుల కోసం లేబర్ ఫ్లో థియేటర్లు (స్టూడెంట్స్ డెమాన్‌స్ట్రేషన్ రూమ్స్) నిర్మిస్తున్నారు. లేబర్ ఫ్లో థియేటర్‌లో భారీ స్క్రీన్‌లపై వైద్య విద్యార్థులు ప్రసవాలను తిలకించవచ్చు. ఐదో ఫ్లోర్‌లో 500 మంది కూర్చునే విధంగా సెమినార్ హాల్‌ను, ప్రతి ఫ్లోర్‌లో వంద సీట్ల సామర్థ్యంతో మిని సెమినార్ హాళ్లు నిర్మించారు.



● డాక్టర్ ఉమాదేవి గవిని

యావదాస్తి ఎంసీహెచ్ బ్లాక్‌కు విరాళం

గుంటూరు జీజీహెచ్‌లో రూపుదిద్దుకుంటున్న ఎంసీహెచ్ బ్లాక్ కోసం పలువురు ఎన్నారై వైద్యులు కోట్లాది రూపాయలు విరాళాలుగా అందిస్తున్నారు. చికాగోలో అలర్జీ/ఇమ్యునాలజిస్టుగా పని చేస్తున్న డాక్టర్ ఉమదేవి గవిని ఈ విషయంలో అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఆమె తన యావదాస్తి..సుమారు రూ.22 కోట్లను ఎంసీహెచ్ బ్లాక్ నిర్మాణానికి విరాళంగా ప్రకటించారు. ఈ ప్రకటనతో.. మూడేళ్ల కిందట అమెరికాలో జరిగిన జింకానా 17వ రీయూనియన్ సమావేశంలో హాజరైన డాక్టర్లు కరతాళ ధ్వనులతో ఆమెను అభినందించారు. డాక్టర్ ఉమాదేవి గవిని అందించిన స్ఫూర్తితో పలువురు ఎన్నారై వైద్యులు తమ వంతుగా భారీ విరాళాలు ప్రకటించారు. అనంతరం జరిగిన జింకానా వార్షిక సమావేశంలో.. ఈ బహుళ అంతస్తుల భవన నిర్మాణానికి డాక్టర్ ఉమాదేవి భర్త, దివంగత డాక్టర్ కానూరి రామచంద్రరావు పేరిట నామకరణం చేయాలని నిర్ణయించి.. "డాక్టర్ కానూరి రామచంద్రరావు జింకానా మెటర్నిటీ అండ్ చైల్డ్ హెల్త్" బ్లాక్‌గా పేరును నిర్ణయించారు.



భవనంలో జరుగుతున్న ఫాల్స్ సీలింగ్ పనులు

గుంటూరుకు 100 మంగళగిరికి 50

- 150 ఎలక్ట్రిక్ బస్సులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తోన్న ఆర్టీసీ
- గుంటూరు-2 డిపోతో పాటు మంగళగిరి డిపోలోనూ ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్..



గుంటూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆర్టీసీకి త్వరలో 150 ఎలక్ట్రిక్ బస్సులు సమకూరనున్నా యి. కేంద్ర ప్రభుత్వ సహకారంతో నగరాలకే కేటాయించనున్న ఈ విద్యుత్‌బస్సులు గుంటూరుకు 100, మంగళగిరి నగరానికి మరో 50 బస్సులు కేటాయించనున్నట్లు ఉత్తర్వులు జారీ అయ్యాయి. త్వరలో రానున్న ఎలక్ట్రిక్ బస్సులకు ఛార్జింగ్ స్టేషన్, గ్యారేజ్‌ల వంటి సదుపాయాల కోసం అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

గుంటూరు -2 డిపోలోనే ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దీని కోసం సివిల్ పనులకు సంబంధించి కూడా రూ. 20 కోట్లు పైనే అవసరమవుతాయని కూడా ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. ప్రధానంగా ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో గుంటూరు-1,2 డిపోలతో పాటు గ్యారేజ్ స్టేషన్‌లు ఇక్కడే ఉన్నాయి. చిన్నపాటి వర్షం వచ్చినా బస్టాండ్ చెరువులను తలపిస్తోంది. ఇటువంటి సమస్యల నేపథ్యంలో ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్‌ఏర్పాటు పనులపై సమీక్షలు చేస్తున్నారు. గుంటూరు-2 డిపో గ్యారేజ్‌లో వరద నీరు చేరకుండా గ్యారేజ్ ఎత్తు పెంచాలని, అందు కోసం సివిల్, ఎలక్ట్రిక్ పనులకు అంచనాలను రూపొందించారు. ముందుగా గ్యారేజ్‌ను ఆరు నుంచి ఏడు అడుగులకు పైగా ఎత్తు పెంచటం, అవసరమైన ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్ పనులు చేపట్టటం వంటి అంశాలపై అధికారులు కసరత్తు చేస్తున్నారు.

మంగళగిరి డిపోలోనూ ఛార్జింగ్ స్టేషన్..

మంగళగిరికి కేటాయించిన 50 ఎలక్ట్రిక్ సర్వీసులకు సంబంధించి అక్కడే ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్ కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి (డీపీటీవో) ఎమ్ రవికాంత్ తెలిపారు. ఇందుకు అనువైన స్థలం మంగళగిరి డిపోలో ఉంది. ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్‌తో పాటు గ్యారేజ్‌ల నిర్మాణ పనులకు సంబంధించి అంచనాలను తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదించారు. మంగళగిరి కేంద్రంగా ఎలక్ట్రిక్ బస్సులు విజయవాడ, రాజధాని అమరావతి, తెనాలి, హైకోర్టు , గుంటూరు వంటి ప్రాంతాలకు రాకపోకలకు వినియోగించాలని రూట్‌మ్యాప్‌లను సిద్ధం చేస్తున్నారు.

మహిళా భద్రతకు.. శక్తి యాప్

ఆపద సమయంలో బాలికలు, యువతలు, మహిళలు తమను తాము రక్షించుకునేందుకు క్షణాలలో పోలీస్ సహాయం పొందేందుకు వీలుగా ప్రభుత్వం శక్తి యాప్‌ను రుపొందించింది. ప్రతి మహిళ తమ మొబైల్ ఫోన్లో ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించింది. ఈ యాప్‌పై మహిళల్లో ముఖ్యంగా బాలికలలో అవగాహన కల్గించేలా ప్రభుత్వం చర్యలు చెప్పటింది.



సత్తెనపల్లి, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆపదలో ఉన్నప్పుడు శక్తి యాప్‌లోని ఎస్‌వోఎస్ ఆప్షన్ నొక్కితే వారి లోకేషన్, వారి వీడియో, ఆడియో కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. పోలీస్ స్టేషన్‌కు వెళ్ళకుండానే ఫిర్యాదు అందుతుంది. ఒంటరిగా ప్రయాణిస్తున్న మహిళలు ఆప్షన్ ద్వారా వాహన నెంబరు, ప్రయాణ మార్గాన్ని షేర్ చేయవచ్చు. పోలీస్ కంట్రోల్ రూమ్ వాహనాన్ని ట్రాక్ చేస్తుంది. మార్గం తప్పితే వేంటనే స్పందిస్తుంది. లైంగిక వేధింపులు, సలహాలు, గృహ హింస, సైబర్ క్రైమ్స్ ఫోటో మార్ఫింగ్, పరువు హత్యలు తదితర ఏ నేరాల గురించి అయిన గెట్ ఏ కంప్లైట్ ఆప్షన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. భర్త వేధింపులు గృహ హింస వంటి సమస్యలకు ఫ్యామిలీ కౌన్సెలింగ్ సేవలు పొందే వీలు ఉంటుంది. అదృశ్యమైన పిల్లల సమాచారం అందజేసి పోలీసుల సహాయం తక్షణమే పొందవచ్చు. అప్రమత్తత కోసం కుటుంబ సభ్యులు, స్నేహితుల ఐదు ఫోన్ నెంబర్లు ఈ యాప్‌లో నమోదు చేసుకోవచ్చు. ఆపద సమయంలో ఎస్‌వోఎస్ బటన్ నొక్కిన వెంటనే సమాచారం పోలీసులకు చేరుతుంది. మహిళల వేధింపులే కాకుండా బహిరంగ మద్యపానం, మదకద్రవ్యాల వినియోగం, చీకటి ప్రదేశాలలో అసాంఘిక కార్యకలపాలను ఫిర్యాదు చేయవచ్చు. అత్యవసర సమయంలో నైట్ షెల్టర్లులో ఆవాసం పొంది ఉదయం వెళ్లవచ్చు సిబ్బంది విదుల పట్ల అప్రమత్తంగా ఉంటూ అయా పరిధిలో ఉన్న ప్రతి సమస్యను సమరస్యంగా పరిష్కరించేలా ఈ యాప్ ఎంతగానో సహకరిస్తుంది. అత్యంత వేగంగా శక్తి యాప్ ఇన్‌స్టాల్ అవుతుంది.

మహిళ భద్రతే లక్ష్యం..



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన శక్తి యాప్ మహిళ భద్రతకు ఎంతగానో ఉపయోగపడుతుంది. అపదలో ఉన్న మహిళలకు రక్షణ కల్పించటమే పోలీస్ యొక్క లక్ష్యం. మహిళలు అందరూ మహిళా శక్తి యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. అపద సమయంలో ఉపయోగించుకోవాలి.

- డీఎస్పీ హనుమంతురావు
డీఎస్పీ, సత్తెనపల్లి

అవగాహన కల్పిస్తున్నాం

మహిళలపై జరుగుతున్న వేదింపులు, దాడుల నుంచి తమను తము కాపాడుకునేందుకు శక్తి యాప్ రక్షణ కవచం. పాఠశాలలు, కాలేజిలలో చదువుకుంటున్న బాలికలకు ఈ యాఫ్‌పై అవగాహన కల్పిస్తున్నాం. అపద ఎదురైనప్పుడు ఎస్‌వోఎస్ బటన్‌ను ప్రేస్ చేస్తే చాలు. లోకేషన్ అధారంగా వారిని గుర్తించి రక్షించేందుకు పోలీసులు ఎప్పుడు సిద్ధంగా ఉంటారు.



కె కిరణ్, సత్తెనపల్లి సీఐ

సీఎం పర్యటనకు చురుగ్గా ఏర్పాట్లు

● అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పాల్గొననున్న చంద్రబాబు



● సీఎం సభా స్థలాన్ని ఎక్స్‌కవేటర్, రోలర్‌తో చదును చేస్తున్న దృశ్యం

తాడికొండ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సోమవారం జరిగే డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలకు పొన్నెకల్లు గ్రామం సిద్ధమవుతోంది. కార్యక్రమంలో సీఎం నారా చంద్రబాబునాయుడు పాల్గొననున్న నేపథ్యంలో ఇప్పటికే అధికారులు, టీడీపీ పార్టీ నాయకులు సభ స్థలాన్ని గుర్తించి బహిరంగ సభకు ఏర్పాటు చేస్తున్నారు. పొన్నెకల్లు బైపాస్ రోడ్డులో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాల ఎదురుగా సీఎం బహిరంగ సభలో పాల్గొంటారు. ఉదయం 10 గంటలకు బహిరంగ సభ జరుగుతుందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉండవల్లిలోని ఇంటి నుంచి హెలీకాప్టర్ ద్వారా పొన్నెకల్లు చేరుకుంటారు. అక్కడ నుంచి ఎస్సీ కాలనీలో ఉన్న డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించి బహిరంగ సభ జరిగే స్థలానికి చేరుకుంటారు. ఎస్సీ వర్గానికి చెందిన 2000 మందితో ముఖాముఖి మాట్లాడుతారు. తదనంతరం నియోజకవర్గంలోని పార్టీ క్యాడర్‌తో సమావేశం నిర్వహిస్తారు. ఇప్పటికే జిల్లా ఇంఛార్జ్ కలెక్టర్ భార్గవ్ తేజ సభ స్థలంలో జరిగే ఏర్పాట్లను పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ పార్టీ క్యాడెర్‌తో కలిసి బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించి, అధికారులతో ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలుసుకుంటున్నారు. హెలీప్యాడ్, బహిరంగ సభ నిర్వహించే స్థలాన్ని ఎక్స్‌కవేటర్, రోలర్లతో చదును చేస్తున్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలని వినతి

గుంటూరు(విద్య), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కోవిడ్ సమయంలో చనిపోయిన ఉపాధ్యాయుల పిల్లలకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు ఇవ్వాలని ఎస్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు పెదబాబు, సుబ్బారెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జడ్పీ సీఈవో జ్యోతిబసుకు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయుల జీతాల నుంచి మినహాయిస్తున్న పీఎఫ్ నగదు చాలావరకు వారి జడ్పీ పీఎఫ్ ఖాతాల్లో నమోదు కాలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ ఖాతాలను ఎప్పటికప్పుడు అప్డేట్ చేసి, ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులకు, పీఎఫ్ క్లోజర్లను, పీఎఫ్ లోన్లు పెట్టిన వారికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ స్టేట్ కౌన్సిలర్లు కమతం శ్రీనివాసరావు, ఎస్కే. బాజీ, తుళ్లూరు మండల అధ్యక్షుడు దిబ్బయ్య, సీనియర్ నాయకుడు సీహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



జడ్పీ సీఈవోకు వినతి పత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

ఆటలొద్దు... పాఠాలు చాలు



(5వ పేజీ తరువాయి)

ఈశ్వర్‌భాయ్ పటేల్ కమిటీల వరకు సిలబస్‌పై పలు సూచనలు ఇచ్చాయి. ప్రశ్నాపత్రం పార్ట్-1లో జనరల్ నాలెడ్జ్, కరెంట్ ఎఫైర్స్ ఉంటే, పార్ట్-2లో విద్యా దృక్పథాలకు సంబంధించి ఉండాలని సూచించాయి. అయితే దీనికి విరుద్ధంగా 2024 డీఎస్సీలో జగన్ ప్రభుత్వం మార్పులు చేసింది. 100 మార్కుల ప్రశ్నాపత్రంలో ప్రాక్టికల్స్‌తో పనిలేకుండా పూర్తిగా థియరీలో మార్కులు సాధిస్తే ఎంపికయ్యేలా మార్పులు చేశారు. పైగా వివరణాత్మక సమాధానాలు కాకుండా కేవలం ఆబ్జెక్టివ్ పద్ధతిలో సమాధానాలతో అదృష్టాన్ని పరీక్షించుకుంటే చాలన్నట్లు మార్చేశారు. గతంలో 70 శాతం థియరీలో ఉత్తీర్ణత అంతంత మాత్రంగా మార్కులు సాధించినా, క్రీడల్లో నైపుణ్యం ఉన్న వారికి ప్రాక్టికల్స్‌లో కలిసివచ్చేది. వారి ప్రతిభ ఆధారంగా మార్కులు పెరిగేవి. దీంతో నిజమైన క్రీడాకారులకు వ్యాయామ ఉపాధ్యాయులు, అధ్యాపకులుగా అవకాశం దక్కేది. అయితే కొత్త విధానంతో ఇదంతా తారుమారైంది. మైదానంలో ఆటలు ఆడలేని, నాలుగు గోడల మధ్య చదవగలిగినవారే వ్యాయామ ఉపాధ్యాయులుగా వచ్చేస్తున్నారు.

పాత పద్ధతిని తీసుకురావాలి..

పాత విధానం ప్రకారం 100 మార్కుల ప్రశ్నా పత్రం లో 70 మార్కులు థియరీకి ఉంటే, మిగిలిన 30 మార్కు లు ఫిజికల్ ఫిట్‌నెస్, స్పోర్ట్స్ స్కిల్ టెస్టులు, క్రీడల్లో ఉన్న నైపుణ్యం తెలుసుకునేలా ప్రాక్టికల్స్ ఉండేవి. థియరీ పరీ క్ష రాయడంతోపాటు, ఆటలు ఆడటం, ఆటలు ఆడగల సామర్థ్యం ఉందని నిరూపించుకోవడం, ఏదో ఒక క్రీడలో నైపుణ్యం కలిగి ఉంటే చాలన్నట్లుండేది. కానీ ప్రస్తుతం ఉన్న సిలబస్‌లో ఇవేమీ లేవు. ఈ పరిస్థితుల్లో జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సిలబస్‌ను చంద్రబాబు గతంలో మాదిరిగానే మార్చాలని పలువురు కోరుతున్నారు. వచ్చే డీఎస్సీలోనూ 70 శాతం థియరీ, మిగిలిన 30 శాతం క్రీడలకు సంబంధించి ప్రాక్టికల్స్ ఉండేలా మార్పులు చెయ్యాలని వ్యాయామ ఉపాధ్యా య సంఘాలు కోరుతున్నాయి. జగన్ ప్రభుత్వంలో తీసుకొచ్చిన విధానంతో అథ్లెటిక్స్, వివిధ క్రీడలు, ఇండోర్, అవుట్‌డోర్ గేమ్స్‌లో ప్రతిభ చూపిన వారికి, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రతిభ చూపినవారికి అన్యాయమే జరుగుతుందని దీనిని మార్చాలని అభ్యర్థిస్తున్నాయి.

ముఖ్యమంత్రికి విన్నవిస్తాం

క్రీడల్లో ప్రావీణ్యం లేకపోయినా, కేవలం బయాలజీలోనో, ఇతర పాఠ్యాంశాల్లో నైపుణ్యం ఉన్నవారు పరీక్షల్లో ఉత్తీర్ణులై వ్యాయామ ఉపాధ్యాయులుగా ఎంపికైతే జరిగే నష్టాలపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరిస్తాం. జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన సిలబస్‌తో భావి క్రీడాకారులకు, ఔత్సాహికులకు తీరని నష్టమే జరుగుతుందని చెప్తాం. క్రీడలపై ఎటువంటి అనుభవం, ఏ ఆసక్తి లేని వారు వ్యాయామ ఉపాధ్యాయులైతే నష్టమే. రాష్ట్రం నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులే కరువయ్యే పరిస్థితి వస్తుంది. ఈ పరిస్థితుల్లో పాత పద్ధతినే వచ్చే డీఎస్సీలో అమలు చేయాలి.

- కరిముల్లాచౌదరి, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, విజయవాడ

30 కాదు.. 50 శాతం అవసరం

30 శాతం ప్రాక్టికల్స్ సరిపోదు. దానిని 50 శాతానికి పెంచాలి. ఈ మేరకు గతంలోనే మార్పులు చెయ్యాలని కోరాం. ఈ తరహాలో చేస్తేనే క్రీడలకు న్యాయం జరుగుతుంది. అంత నైపుణ్యం ఉన్నవారు వ్యాయామ ఉపాధ్యాయులు, అధ్యాపకులైతే మెరికల్లాంటి క్రీడాకారులు వెలుగులోకి వస్తారు. గత ప్రభుత్వం క్రీడలకు ఏ మాత్రం ప్రాధాన్యం లేకుండా నీరుకార్చింది. క్రీడా పరికరాలు, మైదానాల మరమ్మతులకు నిధులు లేకుండా చేయడంతో క్రీడాకారులు నిరుత్సాహానికి గురయ్యారు.

- ఎన్.వెంకటేశ్వరరావు, విశ్రాంత పీడీల సంఘం రాష్ట్ర నాయకులు, తెనాలి.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

దుగ్గిరాల యార్డులో పసుపుధరలు

దుగ్గిరాల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల వ్యవసాయమార్కెట్‌కమిటీయార్డులో శుక్రవారం జరిగిన వేలంలో 589 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10,225, గరిష్ఠధర రూ.12,225, మోడల్‌ధర రూ.11,550 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10,400 గరిష్ఠధర రూ. 111,800, మోడల్‌ధర రూ.11,550 పలికాయి.

పంచాయతీ దుకాణ సముదాయానికి వేలం

దుగ్గిరాల పంచాయతీపరిధిలోని దుకాణ సముదాయాల నిర్వహణ కోసం వేలం శుక్రవారం నిర్వహించారు. శివాలయం సెంటర్, రైలుపేట రైల్వేస్టేషన్‌రోడ్డులో ఉన్న మొత్తం 13 దుకాణాలకు నిర్వహించిన వేలంలో ఏడాదికి రూ.3లక్షల 40వేల ఆదాయం లభించిందని పంచాయతీకార్యదర్శి కె.వివేకానంద తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలంలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు యువకులను మంగళగిరి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసు వివరాలను శుక్రవారం మీడియాకు వెల్లడించారు. తాడేపల్లి మండలం వడ్డేశ్వరం శివారులో కేఎల్‌యూ కాలువ కట్ట సమీపంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్టు సమాచారం మేరకు మంగళగిరి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టరు జీ.వీరాంజనేయులు, గుంటూరు ఇన్‌స్పెక్టర్ నయనతార ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి దాడిచేశారు. గంజాయి కలిగి వున్న కుంభా నాగవెంకటేష్, గుండిమెడ జోజిబాబు, మీర్జాపూర్ సూరజ్‌కుమార్‌లను అదుపులోకి తీసుకుని వారినుంచి 120గ్రాముల గంజాయి, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో వడ్డేశ్వరం వీఆర్వో వి.ప్రసాదరావు, మహిళా పోలీస్ నాగదుర్గా కిరణ్మయి, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు. నిందితులను మంగళగిరి కోర్టులో హాజరుపరిచినట్టు తెలిపారు.

పారిశుధ్య కార్మికుల భిక్షాటన

తుళ్లూరు, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): తుళ్లూరులో పారిశుధ్య కార్మికులు పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరుతూ శుక్రవారం భిక్షాటన చేశారు. అనంతరం తుళ్లూరు సీఆర్డీఏ ప్రాంతీయ కార్యాలయంలో సోషల్ వెల్ఫేర్ అధికారి బీ శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షుడు ఎం.రవి మట్లాడుతూ, జీతాలు పెండింగ్ పెట్టి కార్మికులను పస్తులుంచుతున్నారన్నారు. దీనిపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికులను పెంచాలని డిమాండ్ చేశారు.

నేడు తొమ్మిది గ్రామాలకు కరెంటు కోత

మందడం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 9గ్రామాలకు శనివారం ఉదయం 9గంటల నుండి 2వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అసిస్టెంట్ ఇంజనీర్ ఉమామహేశ్వరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మందడం, వెంకటపాలెం, తాళ్లాయపాలెం, వెలగపూడి, మల్కాపురం ఐనవోలు లింగాయపాలెం, మోదులింగాయపాలెం, ఉద్దండ్రాయునిపాలెం గ్రామాలకు కరెంట్ కోత ఉంటుందని తెలిపారు.

నేడు ప్రత్తిపాడులో...

ప్రత్తిపాడు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండలంలో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ గౌతమ్ తెలిపారు. మరమ్మతుల కోసం కోతను విధించడం జరుగుతుందన్నారు.

నేడు తిరునాళ్ల ప్రధాన ఘట్టం

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతపల్లిపాడు గ్రామంలోని గోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలు తిరునాళ్ళ వైభవంగా సాగుతుంది. శుక్రవారం మహిళలు మేళతాళాల మధ్య జలబిందెలతో ఆలయానికి తరలి వచ్చి అమ్మవారికి సమర్పించారు. సాయంత్రం మల్లెపూలతో సహస్ర నామావళి పూజలు నిర్వహించారు.

పెదనందిపాడు ఏఎస్‌ఐగా బాలశౌరి

పెదనందిపాడు: పెదనందిపాడు పోలీస్ స్టేషన్ ఏఎస్‌ఐగా శుక్రవారం బాలశౌరి బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆయనతో పాటు కానిస్టేబుల్ సైదుల్లా కూడా విధుల్లో చేరారు.

ప్రతి మీటింగ్ మహిళల ఎదుగుదలకు ఉపయోగంగా ఉండాలి

తుళ్లూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ప్రతినెల వెలుగు మండల సమాఖ్య జరిపే మీటింగ్ మహిళల ఆర్థిక ఎదుగుదలకు ఉపయోగంగా ఉండాలని తుళ్లూరు మండల ఏపీఎం చినవీరయ్య పేర్కొన్నారు. తుళ్లూరు మండల కార్యాలయంలో సమాఖ్యసభ్యుల సమావేశంలో జీవనోపాదుల ఆర్థిక ఎదుగుదలకు కేటాయించే రుణాల గురించి చర్చించారు. సమావేశంలో మండల సమాఖ్య సభ్యులు, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో పోషకాహారం తయారీ

ప్రత్తిపాడు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తక్కువ ఖర్చుతో పోషకాహారం తయారు చేసుకోవచ్చని ప్రత్తిపాడు ఐసీడీఎస్ సీడీపీవో సుజాతాదేవి తెలిపారు. పోషకాహార వారోత్సవాలలో భాగంగా ప్రత్తిపాడు, గొట్టిపాడు అంగన్వాడీ కేంద్రాల్లో తల్లులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమలలో సూపర్‌వైజర్స్ భారతి, మాధవి పాల్గొన్నారు.

● కాకుమాను: గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారంతో వ్యాధుల నుంచి దూరంగా ఉంచవచ్చని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పారి వెంకాయమ్మ తెలిపారు. పౌష్టికాహార పక్షోత్సవాలను శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● పెదనందిపాడు: మండలంలోని జరుగులవారిపాలెం, పుసులూరు గ్రామాల్లో ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పోషక పక్షోత్సావాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు సూపర్‌వైజర్ అరుణ సంజీవని కిట్లను పంపిణీ చేశారు. లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

నా గౌరవాన్ని నిలబెట్టారు

● వచ్చే వారం నుంచే ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్ ● మన ఇల్లు-మన లోకేశ్ కార్యక్రమంలో మంత్రి లోకేశ్



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలతోపాటు నూతన వస్త్రాలను అందజేస్తున్న మంత్రి నారా లోకేశ్

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): 'మంగళగిరిలో గెలవకపోవడంతో హేళన చేశారు. సొంత కొడుకును గెలిపించుకోలేకపోయారని చంద్రబాబును కూడా విమర్శించారు. 2019 నుంచి 2024 వరకు తనను అనేక రకాలుగా అవమానించారు. 5,300 ఓట్ల తేడాతో ఓడిపోగా ఆ సంఖ్య పక్కన మరో సున్నా పెట్టి 53 వేల ఓట్లతో గెలిపించాలని ఆనాడు మంగళగిరి ప్రజలను కోరాను. విమర్శించిన వారందరికీ దిమ్మతిరిగేలా 91వేల ఓట్ల మెజార్టీతో గెలిపించి శాసనసభకు పంపించి తన గౌరవాన్ని నిలబెట్టారు..' అని మంత్రి లోకేశ్ తెలిపారు. మన ఇల్లు-మన లోకేశ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం డాన్‌బోస్కో పాఠశాల పక్కన ఏర్పాటుచేసిన వేదికపై నాల్గోరోజు మొత్తం 1030 పేదలకు ఇంటిపట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను మంగళగిరి నియోజకవర్గ ప్రజల కోసం ఇన్ని మంచి కార్యక్రమాలు చేస్తున్నానంటే అందుకు ఇక్కడి ప్రజలు తనకిచ్చిన మెజార్టీనే కారణమన్నారు. వచ్చే వారం నుంచి లబ్ధిదారులు రూపాయి ఖర్చులేకుండా ఇంటి పట్టాలను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. రాబోయే రోజుల్లో మంగళగిరి ప్రాంతం అద్భుతమైన ప్రగతిని సాధిస్తుందని, ఎవ్వరూ ఇళ్లపట్టాలను అమ్ముకోవద్దని సూచించారు. ఏడాదిలోగా నూతన వస్త్రాలతో ఇళ్లపట్టాలు ఇస్తానని చెప్పానని, 11 నెలల్లోనే ఆ హామీని నిలబెట్టుకున్నట్లు తెలిపారు. మంగళగిరి ప్రజల దశాబ్దాల కల వంద పడకల ఆస్పత్రికి ఆదివారం శంకుస్థాపన చేసి ఏడాదిలోగా పూర్తిచేస్తామన్నారు. తాడేపల్లిలో హెల్త్ క్లినిక్ ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. 31 కమ్యూనిటీ భవనాలను నిర్మించాలని ప్రజలు కోరగా, 17 భవనాలకు భూములను గుర్తించామని, రెండు భవనాల పనులు త్వరలో పూర్తికాబోతున్నాయన్నారు. మంగళగిరి నియోజకవర్గ ప్రజలు తనపై వుంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ దేశంలోనే మంగళగిరిని అన్ని రంగాల్లోనూ నెం.1గా తీర్చిదిద్దుతానని మంత్రి చెప్పారు.

ఇళ్లే తొలగిస్తామన్నారు..



నాలుగు దశాబ్దాలపై నుంచి రత్నాలచెరువులో నివాసం ఉంటున్నాం. గతంలో పట్టాలు అడిగితే ఇళ్లు తొలగిస్తామని చెప్పారు. భయాందోళనతో జీవనం సాగిస్తున్నాం. లోకేశ్ ఎంతో భరోసా ఇచ్చి పార్టీలను పక్కన పెట్టి పట్టాలను ఇచ్చారు. ప్రజలకు మంచి చేసే వారే నిజమైన నాయకులు. ఆయన చేతుల మీదుగా శాశ్వత ఇంటి పట్టాను అందుకోవడం సంతోషంగా ఉంది.

- దర్శనం హంస, సీత, ఏసమ్మ

లోకేశ్ నిజమైన హీరో



మా తండ్రి 40 ఏళ్ల క్రితం రత్నాలచెరువులో రూ.150తో పూరిపాకను కొనుగోలు చేశారు. అప్పటి నుంచి ఇక్కడే ఉంటున్నాం. లోకేశ్ ఆస్తిపై శాశ్వత హక్కు కల్పించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ఆయన నిజమైన హీరో. ఇంటి పట్టా కోసం మేం ఎవ్వరి చుట్టూ తిరగలేదు. అధికారులే వచ్చి కొలతలు తీసుకున్నారు.

- బందరు రాజ్యలక్ష్మి, సుబ్బారావు



సీఎం సభ ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

అంబేద్కర్ జయంతి వేడుకలకు తరలిరండి

● సీఎం సభను జయప్రదం చేయాలి

తాడికొండ(పొన్నెకల్లు), ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): డాక్టర్ అంబేద్కర్ జయంతి వేడుకలకు ప్రజలు తరలిరావాలని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈనెల 14న తాడికొండ మండలం పొన్నెకల్లులో అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహించనున్న నేపథ్యంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు బహిరంగా సభలో పాల్గొననున్నారు. సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే శుక్రవారం స్థానిక టీడీపీ నాయకులు, అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం పొన్నెకల్లు పంచాయతీ కార్యాలయంలో అధికారులు, టీడీపీ నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఎడ్డూరి హనుమంతరావు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి, నీటి సంఘం అధ్యక్షులు గుంటుపల్లి మధుసూదనరావు, జిల్లా టీడీపీ కార్యాలయం కార్యదర్శి కంచర్ల శివరామయ్య, యడ్లపల్లి సాంబశివరావు, నెల్లూరి రాజశేఖర్, పాలేరు రమేష్, పంచాయతీ కార్యదర్శి షేక్ జానీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

తాడికొండ(బడేపురం), ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): తాడికొండ శివారు గ్రామం బడేపురం కొండపై నూతనంగా నిర్మించిన గంగా పార్వతీ సమేత ఓంకారేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అంతేకాకుండా ధ్వజస్తంభం, ఆలయ గోపుర కలశాలు ప్రతిష్ఠించారు. భక్తులు ఓంకారేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, సీనియర్ నాయకులు ఎడ్డూరి హనుమంతరావు, మన్నె బాబు, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి కంచర్ల సాంబశివరావు, మాజీ సర్పంచ్ నూతక్కి నవీన్‌కుమార్, వాసిరెడ్డి జయరామయ్య, యడ్లపల్లి సాంబశివరావు పాల్గొన్నారు.

వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమించిన పూలే



మంగళగిరి: ఇళ్ల పట్టాల పంపిణీ సభలో జ్యోతిరావుపూలే చిత్రపటానికి నివాళ అర్పిస్తున్న మంత్రి నారా లోకేశ్



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శంకరరావు, నేతలు

మంగళగిరి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అంటరానితనం, కుల వ్యవస్థ, లింగ వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమించిన మానవతా మూర్తి జ్యోతిబా పూలే అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. జ్యోతిబా పూలే జయంతిని పురస్కరించుకుని మంగళగిరిలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో నేతలు ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. శంకరరావు మాట్లాడుతూ సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలు అభివృద్ధి చెందకపోతే సమాజం వెనుకబాటుకు గురవుతుందని భావించిన పూలే స్త్రీ విద్యను ప్రోత్సహిస్తూ అనేక పాఠశాలలను స్థాపించారని చెప్పారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లూరి హనుమంతరావు, నేతలు వుడతా శ్రీనివాసరావు, మోపిదేవి శివకృష్ణ, మొవ్వా మల్లికార్జునరావు, కిరణ్, నాగబాబు, దానా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● మంగళగిరి సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో జ్యోతిబా పూలేకు ఘననివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో వేదిక కన్వీనర్ గుత్తికొండ ధనుంజయరావు, రేకా కృష్ణార్జునరావు, మానవతా వేదిక కన్వీనర్ గోలి మధు, ఆంధ్ర నాటక కళాసమితి అధ్యక్షుడు నన్నపనేని నాగేశ్వరరావు, పొట్లాబత్తుని లక్ష్మణరావు పాల్గొన్నారు. మంగళగిరి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టుల ప్రాంగణంలో పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు లంకా శివరామప్రసాద్, కురగంటి రమేష్, అడిషనల్ పీపీ రెంటపల్లి రాజేష్, న్యాయవాదులు పాల్గొన్నారు.

మహాత్మా పూలే ఆదర్శనీయుడు

- టీడీపీ పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మహాత్మాపూలే ఆదర్శనీయుడని టీడీపీ పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు అన్నారు. శుక్రవారం పూలే జయంతి సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో వల్లభనేని వెంకట్రావు ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలలు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి దారా దాసు, తాడిబోయిన భాస్కర్, ఇట్టా పెంచలయ్య, భాస్కర్, అద్దంకి మురళీకృష్ణ, మండవ గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

● దుగ్గిరాల, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): బాలికల కోసం తొలి పాఠశాల స్థాపించిన ఘనత జ్యోతిరావ్‌పూలేదని ఎంపీపీ షేక్ జబీన్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో పూలే జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి పాటుపడిన పూలే చిరస్మరణీయుడన్నారు. మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, సాదిక్, సలావుద్దీన్, డిప్యూటీ ఎంపీడీఓ కె.జవహర్, ఏఓ వడ్లమూడి చంద్రమోహన్, పలువురు పంచాయతీకార్యదర్శులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు తదితరులు

● ఫిరంగిపురం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): జ్యోతిరావు పూలే మహనీయుడని టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కొత్తపల్లి కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఫిరంగిపురంలోని పార్టీ మండల కార్యాలయంలో పూలే జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి పసల తోమాస్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు, ఎస్సీ, ఎస్టీలకు, మైనార్టీలకు విద్యను నేర్పిన ఘనత పూలేదన్నారు. టీడీపీ నాయకులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు మండవ నరసింహారావు, బీసీ సెల్ అధ్యక్షుడు పైనబోయిన శివయ్య, కటికల రామకోటేశ్వరరావు, కే అప్పారావు, పీ దివ్య, పున్నారెడ్డి, వేల్పుల అంకారావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

● కాకుమాను, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యానికి పూర్వమే సాంఘీక దురాచారాలు, అణగారిన వర్గాల అభ్యున్నతికి పోరాడిన తొలి సంఘ సంస్కర్త జ్యోతిరావుపూలే అని తహసీల్దార్ వెంకటస్వామి కొనియాడారు. శుక్రవారం మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో జ్యోతిరావుపూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పరిశోధనా రంగ పుస్తకాన్ని ఆవిష్కరించిన డాక్టర్ అశోక్‌కుమార్ తదితరులు

విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు పెరగాలి

● శాస్త్రవేత్త, ప్రొఫెసర్ అశోక్‌కుమార్ గంగూలీ

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి) విశ్వవిద్యాలయాల్లో పరిశోధనల స్థాయి మరింత పెరగాల్సిన అవసరం వుందని బెరంపూర్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ డైరెక్టర్, శాస్త్రవేత్త ప్రొఫెసర్ అశోక్‌కుమార్‌గంగూలీ అన్నారు. మంగళగిరిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ లో శుక్రవారం జరిగిన 9వ రీసెర్చ్‌డే సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం వర్సిటీ ఉపకులపతి ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. వర్సిటీలో జరుగుతున్న పరిశోధనలు, సాధించిన ప్రగతిని వీసీ మనోజ్‌కుమార్ వివరించారు. రీసెర్చ్ డీన్ డాక్టర్ రంజిత్‌థాపా మాట్లాడుతూ రీసెర్చ్‌డే సందర్భంగా నలుగురు ప్రొఫెసర్లకు ఉత్తమ పరిశోధనా పురస్కారాలను ప్రదానం చేస్తున్నామన్నారు. అనంతరం 17మంది యూపీ, పీజీ విద్యార్థులకు బంగారు పతకాలు, ఏడుగురికి రజత పతకాలు, పది మంది పీహెచ్‌డీ విద్యార్థులకు బంగారు పతకాలు, ఐదుగురికి రజత పతకాలు, ప్రశాంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఎం రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ప్రేమ్‌కుమార్, రీసెర్చ్ డే కన్వీనర్ డాక్టర్ సునిల్ చిన్నదురై, డాక్టర్ ఆయాషా తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఖాళీ పొలాల్లో 30 రకాల విత్తనాలు వేసుకోవాలి

జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ కే రాజకుమారి

ఫిరంగిపురం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రైతులు రుతుపవనాలు రాకముందే ఖాళీ పొలాల్లో 30 రకాల విత్తనాలు వేసుకొని 45 రోజుల తరువాత కొంత భాగం ఉపయోగించుకొని మరికొంత భాగం పశువుల మేతగా ఉపయోగించుకోవాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ కే రాజ కుమారి అన్నారు. శుక్రవారం మండలంలోని వేములూరిపాడు, మునగపాడు, 113 తాళ్ళూరు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించిన ఆమె ఆయా గ్రామాల రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో గుంటూరు రీజియన్ మాస్టర్ ట్రైనర్ చింతా వరప్రసాదు, మోడల్ మేకర్ ఇర్ల వెంకటేశ్వర్లు, అన్నామణి, యూనిట్ ఇన్‌చార్జ్ జే రామకృష్ణ, ఐసీఆర్‌పీలు అరుణ, అమల, గాయత్రి, శాంత కుమారి, లావణ్య, ప్రభావతి, రైతులు పాల్గొన్నారు.



మల్లేశ్వరికి రూ.6 లక్షల ఎల్‌వోసీ చెక్కును అందజేస్తున్న టీడీపీ నేతలు

వైద్యానికి రూ.6 లక్షల ఎల్వోసీ

● మంత్రి లోకేశ్ ఆదేశాలతో చెక్కు అందజేత

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న మంగళగిరి బ్యాంకు కాలనీకి చెందిన జొన్నాదుల మల్లేశ్వరికి మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో రూ.6 లక్షల లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌వోసీ) చెక్కు మంజూరైంది. గుంటూరులోని అర్కా ఆస్పత్రిలో ఆమె చికిత్స పొందుతున్నారు. వైద్యం చేయించే స్తోమత లేక కుటుంబ సభ్యులు స్థానిక నేతల ద్వారా మంత్రి నారా లోకేశ్‌ను ఆశ్రయించగా స్పందించిన సీఎం సహాయ నిధి నుంచి చెక్కును మంజూరు చేయించారు. ఆ చెక్కును స్థానిక నేతల ద్వారా శుక్రవారం ఆమె కుటుంబానికి అందజేయించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, నేతలు గోసాల రాఘవ, షేక్ కరీముల్లా, పిల్లి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు అందిపుచ్చుకోవాలి

● బీజేపీ నాయకులు

తుళ్లూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకోవాలని బీజేపీ నాయకులు అన్నారు. శుక్రవారం పండలంలోని ఉద్దండ్రాయునిపాలెంలో బీజేపీ అధిష్టానం ఆదేశాల మేరకు పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నాయకులు నిర్వహించారు. కొత్తగా నిర్మాణం జరగుతున్న ఈ అండ్ హెల్త్ సెంటర్ భవనాన్ని వారు పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో ఆహార పదార్థాలను పరిశీలించారు. బీజేపీ ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలు, రాజధాని అమరావతికి అందిస్తున్న సహకారం గురించి రచ్చబండ వద్ద చర్చించారు. కార్యక్రమంలో బీజేపీ అర్బిజన్ స్టేట్ కో కన్వీనర్ కోళ్లపూడి హేమ సుందర్, మండల ఉపాధ్యక్షుడు సరిపూడి సాంబశివరావు, కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరావు, పరుచూరి రమణయ్య, బూత్ కమిటీ అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకటేశ్వరావు, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.



ఉద్దండ్రాయునిపాలెం రచ్చ బండ వద్ద గ్రామస్తులతో బీజేపీ నాయకులు

ఘనంగా ఏఐకేఎస్ ఆవిర్భావ దినోత్సవం

తాడేపల్లి(వడ్డేశ్వరం), ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా ఏర్పడిందే ఏఐకేఎస్ జెండా అని ఏపీ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీ కృష్ణయ్య అన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయం వద్ద ఏఐకేఎస్ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సంఘం జెండాను రైతు సంఘం రాష్ట్ర సీనియర్ నాయకుడు వై కేశవరావు, కౌలు రైతు సంఘం జెండాను వీ కృష్ణయ్యలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ జాతీయ ఉద్యమంలో లాయర్లు, విద్యార్థులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్న సమయంలో రైతులు ఉవ్వెత్తున జాతీయ ఉద్యమంలో పాల్గొనడం వలన ఉద్యమం కొత్త ఊపును తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో నేతలు జొన్నా శివశంకర్, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, టి.బక్కిరెడ్డి, పల్లె కృష్ణ, కంచర్ల జేమ్స్, సుబ్బారెడ్డి, గోపిరెడ్డి, పార్వతి అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.




ఏఐకేఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న కృష్ణయ్య, కేశవరావు తదితరులు

కుంచనపల్లిలో...

తాడేపల్లి(కుంచనపల్లి), ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కుంచనపల్లిలో ఏఐకేఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం గ్రామ కార్యదర్శి అమ్మిశెట్టి రంగారావు పతాకావిష్కరణ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయకార్యదర్శి జొన్నా శివశంకర్ మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు కాజ వెంకటేశ్వరరావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, అమ్మిశెట్టి శ్రీనివాసరావు, బడుగు వెంకటేశ్వరరావు, యనుముల సాంబయ్య, సుబ్బారావు, వీరాస్వామి, ఆదియ్య పాల్గొన్నారు. కాగా ఉండవల్లిలో కూడా ఏఐకేఎస్ పతాకావిష్కరణ నిర్వహించారు.

కేఎల్‌యూలో ఘనంగా ముగిసిన తెలుగు అంతర్జాతీయ సదస్సు

తాడేపల్లి (వడ్డేశ్వరం), ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): వడ్డేశ్వరం కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో బీఏ ఐఏఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ఘనంగా ముగిసింది. సదస్సులో దేశవ్యాప్తంగా ఉన్న పలు యూనివర్సిటీలు, కళాశాలలకు చెందిన 130మంది దళిత కవిత్వం, స్త్రీవాద కవిత్వం, మైనార్టీ కవిత్వం కథానిక, నవల, వచన కవిత్వం, హైకూలు, నానీలు అభ్యుదయం విప్లవం వంటి అనేక ప్రక్రియలపై పరిశోధనా పత్రాలు సమర్పించారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిధిగా హాజరైన ప్రపంచ తెలుగు రచయితల ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచంద్ మాట్లాడుతూ సాహిత్యమనేది విశ్వశ్రేయస్సును కాంక్షించేదై ఉండాలన్నారు. విశిష్ట అతిధి కమిషనర్ ఆఫ్ కాలేజి ఎడ్యుకేషన్ డాక్టర్ టి జాన్‌కిరణ్‌బాబు మాట్లాడుతూ నూతన విద్యావిధానానికి అనుగుణంగా మన రాష్ట్రంలో కూడా విద్యావ్యవస్థలో ప్రభుత్వం మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో బీఏ ఐఏఎస్ విభాగాధిపతి డాక్టర్ బి శివనాగయ్య, అతిధులు యాజమాన్యం ముద్రించిన సివిల్ సర్వీసెస్, సీ పాట్ గ్రంథాన్ని విడుదల చేశారు. కంట్రోలర్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ ఆఫీసర్ దేవీ ప్రసాద్, ఆర్అండ్‌డీ డీన్ డాక్టర్ మాధవ్, సదస్సు ఉప సంచాలకులు డాక్టర్ అద్దంకి ప్రజాపతి, వీసీ డాక్టర్ సారథివర్మ, రిజిస్ట్రార్ డాక్టర్ సుబ్బారావు, ప్రోవీసీలు పాల్గొన్నారు.



సివిల్ సర్వీసెస్, సీ పాట్ గ్రంథాన్ని విడుదల చేస్తున్న అతిథులు

కేఎల్‌యూలో నేడు మహిళా దినోత్సవం

కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో ఫెమ్ ఫ్లేర్ పేరుతో మహిళా మహోత్సవం శనివారం జరగనున్నట్లు ఫెమ్ ఫ్లేర్ కన్వీనర్ డాక్టర్ కె రూత్‌రమ్య తెలిపారు. ఈ మేరకు విద్యార్థి సంక్షేమ విభాగ ఇన్‌చార్జి డీన్ డాక్టర్ ప్రసాద్ విద్యార్థులతో కలిసి ఫెమ్‌ఫ్లేర్ పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు. రూత్‌రమ్య మాట్లాడుతూ మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వీసీ సారథివర్మ, ప్రోవీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ కె రాజశేఖరరావు, డాక్టర్ వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె సుబ్బారావు, డాక్టర్ గోవర్ధిని, డాక్టర్ సీహెచ్ శ్రీకావ్య, కన్వీనర్లు డాక్టర్ కె.సోని, డాక్టర్ హరిత, డాక్టర్ ఎ ప్రియా, డాక్టర్ పి.లక్ష్మీప్రసన్న, డాక్టర్ వి.శైలజ, డాక్టర్ పి.రాజరాజేశ్వరి, డాక్టర్ శాంతిశ్రీ, డాక్టర్ కోనేరు స్వప్న తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు చట్టసవరణ బిల్లును రద్దు చేయాలి

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డు చట్టసవరణ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తాడేపల్లి ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. నులకపేట మసీదు సెంటర్ నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. పలువురు ప్రసంగిస్తూ ఈ చట్టం ఆస్తులు కబ్జా చేయడానికి తప్ప వక్ఫ్ బోర్డు ఆస్తుల అభివృద్ధికి కాదన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పటాన్ ఖాసింఖాన్, మహమ్మద్ గోరేబాబు, షేక్ శ్రీనుబాష, సలీంబాష, ముఫ్తి అహ్మద్, సయ్యద్ సర్దార్, సుభాని, గని, ఖాజాబాయి, ముఫ్తి ముకర్రమ్, ఇమ్రాన్, ఇర్ఫాన్, సైదులు తదితరులు పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

చలివేంద్రం ప్రారంభం

'ఆంధ్రజ్యోతి'కి స్పందన

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఎండ తీవ్రత పెరగడంతో ప్రజలు దాహార్తితో ఇబ్బంది పడుతున్నారని ఏప్రిల్ నెల వచ్చినా ఇంకా ప్రభుత్వం ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంపై ఈ నెల 8వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి మునిసిపల్ అధికారులు స్పందించారు. శుక్రవారం స్థానిక శివాజీచౌక్‌లో చలివేంద్రాన్ని మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కమిషనర్ బండిశేషన్నతో కలసి ప్రారంభించి చల్లని మజ్జిగను పంపిణీ చేశారు. ప్రజల ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకొనివెళ్లి సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేసిన ఆంధ్రజ్యోతికి పట్టణ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు పనిచేయనున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రెండో శనివారం కూడా పనిచేస్తుందని సబ్ రిజిస్ట్రార్ బుజ్జిబాబు చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రిజిస్ట్రేషన్లు నిర్వహిస్తామని ఈ అవకాశాన్ని డాక్యుమెంట్ రైటర్లు, కక్షిదారులు వినియోగించుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తెనాలి రూరల్, తెనాలి అర్బన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ రూరల్ ఏఈ తోటకూర వీరవెంకట్రావు, ఏడీఈ బి.అశోక్‌కుమార్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. అంగలకుదురు సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ కోపల్లె - గుడివాడ లైన్‌లో చెట్ల తొలగింపు, లైన్ల మరమ్మతులు చేపట్టామన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకూ కోపల్లె, యడ్ల లింగయ్య కాలనీ వంటి పలు ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఓ ప్రకటనలో కోరారు.

పొన్నూరులో...

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పొన్నూరు పట్టణ, మండలంలో విద్యుత్ కోత అమలులో ఉండనున్నట్లు ఈ శాఖ డీఈఈ శ్యాంబాబు శుక్రవారం తెలిపారు.

ఘనంగా ఎన్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఫేర్‌వెల్

తెనాలి అర్బన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఎన్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఫేర్‌వెల్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ శాస్త్రవేత్త చందు సాంబశివరావు జ్యోతి ప్రజ్వలనచేసి వేడుకలను ప్రారంభించారు. కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించాలంటే నైపుణ్యాలు ఎంతో అవసరమన్నారు. ముఖ్యంగా ఇంజనీరింగ్ విద్యార్థులు సెల్‌ఫోన్‌తో కాలం గడపకుండా నైపుణ్యాలు పెంపొందించుకుంటేనే ఉపాధి అవకాశాలు అందుకోగలుగుతారని చెప్పారు. ప్రిన్సిపాల్ అజయ్, అధ్యాపకులు శ్రీధర్, లిల్లీ, నాగార్జున, స్వాతి, అరుణ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని శ్రీవెంకటేశ్వర యోగ సేవా కేంద్రం సభ్యులు నిర్వహించారు. శుక్రవారం స్థానిక గాంధీనగర్‌లోని షిరిడి సాయి వృద్ధాశ్రమంలో ఎస్‌వీ యోగా సభ్యులు విశ్రాంత ఎస్పీ విడియాల రుద్రకుమార్, అనురాధ దంపతుల సహకారంతో ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లను పంపిణీ చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎస్‌వీ యోగా కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య, యోగా కేంద్రం సభ్యులు, వృద్ధాశ్రమం నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆరోపణల్లో వాస్తవం లేదు: ఏంఈవో లక్ష్మీనారాయణ

తెనాలిరూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మంచి బోధన అందించేలా కృషి చేస్తున్నానే తప్ప ఎక్కడా అవినీతికి పాల్పడటం లేదని మండల విద్యాశాఖాధికారి (ఎంఈవో-1) మేకల లక్ష్మీనారాయణ చెప్పారు. ఏంఈవో లక్ష్మీనారాయణపై చర్యలు తీసుకోవాలని వచ్చిన ఫిర్యాదుపై శుక్రవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. తాను వార్షిక తనిఖీల్లో లంచంతీసుకుంటున్నానని, మహిళా ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నానన్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. మండలంలో తన పరిధిలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్‌లో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా అమలయ్యేలా బాధ్యతగా మెలుగుతున్నానని ఫలితంగా తానంటే గిట్టని వారు వ్యక్తిగతంగా చేస్తున్న విమర్శలేతప్ప వాస్తవం కాదని ఓ ప్రకటనలో ఖండించారు.

పౌష్టికాహారంతో వ్యాధులు దూరం: సీడీపీవో

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారంతో వ్యాధుల నుంచి దూరంగా ఉంచవచ్చని సీడీపీవో వెంకట రమణ అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాలను శుక్రవారం పాత పొన్నూరు అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు వెయ్యి రోజులు పౌష్టికాహారం అందించడంపై అవగాహన కల్పించారు. చిన్నారులు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచడంతో పాటు ఆరుబయట ఆటపాటలు ఆడించడం, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంచడంతో పాటు చిరుధాన్యాలను అందించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తొలి సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్



జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్ తదితరులు

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యానికి పూర్వమే సాంఘీక దురాచారాలు, అణగారిన వర్గాల అభ్యున్నతికి పోరాడిన తొలి సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే అని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ కొనియాడారు. శుక్రవారం పొన్నూరు పట్టణంలో జ్యోతిరావుపూలే 198వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జ్యోతిరావుపూలే దంపతులు పాటుపడ్డారన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాతాని రమేష్, కూటమి పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కుల నిర్మూలన సంఘ రాష్ట్ర కోశాధికారి డాక్టర్ రాజారావు, తోడేటి శ్రీనివాస్, బలగాని వెంకటేశ్వర్లు, మానవ హక్కుల వేదిక జిల్లా కన్వీనర్, జీఎస్ రాయల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సీపీఐ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు ఆధ్వర్యంలో, బీసీ సేవా దళం ఆధ్వర్యంలో దండమూడిలో పూలే జయంతిని నిర్వహించారు. పట్టణంలోని పాత పొన్నూరు జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద పలు సంఘాల నాయకులు, లుంబినివనంలో దళిత ఉద్యమ నేత డాక్టర్ కత్తి పద్మారావు ఆధ్వర్యంలో, చేబ్రోలు మండలంలోని పలు గ్రామాలలో పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.



పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న తదితరులు

● తెనాలి రూరల్: మహాత్మజ్యోతిరావు పూలే జయంతిని పట్టణంలో పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ, మండల అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, కేసన కోటేశ్వరరావు పార్టీ నాయకులతో కలిసి మహాత్మజ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. స్టేట్ పద్మశాలివెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు పణిదపు దుర్గ, మహమ్మద్ ఖుద్దుస్, అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, మల్లవరపు విజయ్‌కుమార్, కంచర్ల ఏడుకొండలు,ఆంజనేయులు, ముళ్లపూడి వెంకట్, వసంతం అశోక్, కావేటి వేణు, పరమేష్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

● పట్టణంలోని వైసీపీ కార్యాలంలో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో మహాత్మజ్యోతిరావుపూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, పలువురు వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.

● పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ఐక్యత ఆధ్వర్యంలో ఐక్యవేదిక అధ్యక్షుడు అక్కిదాసు కిరణ్‌కుమార్ జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● తెనాలి అర్బన్: సమాజంలో కుల వ్యవస్థను నిర్మూలించేందుకు, మహిళా సంక్షేమానికి జ్యోతిరావు పూలే కృషి చేశారని సబ్ కలెక్టర్ సంజన సింహా పేర్కొన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం పూలే జయంతి నిర్వహించారు. పలువురు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. కుల నిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యంలో తేలప్రోలులోని ఎస్‌టీ కాలనీలో జరిగిన పూలే జయంతి సభలో జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి కృష్ణ, దుర్గా, శ్యామ్, బెన్‌హర్, పోతురాజు పాల్గొన్నారు. బీసీ సంఘాల కార్యాలయంలో జరిగిన పూలే జయంతి వేడుకల్లో నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు, శివరామకృష్ణ, కుర్రా శ్రీను, రాహుల్, రమేష్, మురళి తదితరులు పూలే చిత్రపటానికి పాల్గొన్నారు.



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సబ్ కలెక్టర్ సంజన సింహా

ఏఎన్‌యూలో...

పెదకాకాని, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు పూలే జీవితం నేటి విద్యార్థులకు ఆదర్శనీయమని ఆచార్య బాలబోయిన సుదర్శన్ తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మహాత్మ జ్యోతిరావు పూలే అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతిని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఐపీఎస్ అధికారులు షేక్ షరీన్‌బేగం, విశ్వవిద్యాలయ రెక్టార్. ఆచార్య. రత్నషీలామణి, ఆచార్య త్రిమూర్తిరావు, విశ్వ విద్యాలయ రిజిస్ట్రారు ఆచార్య. జి.సింహాచలం, ఆచార్య. కే.సుమంత్‌కుమార్, ఆచార్య ఎం.జగదీష్ నాయక్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్, ఆచార్య. ఎం.సురేష్ కుమార్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య. కె.వీరయ్య, వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య. పాల్‌కుమార్, అంబేద్కర్ అధ్యయన కేంద్ర డైరెక్టర్ ప్రొఫెసర్.అశోక్ కుమార్, బాబు జగ్జీవన్ రామ్ అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య పీజే రత్నాకర్, ఆచార్య కె.ధనలక్ష్మి, బాలుర వసతి గృహ వార్డెన్ కె.మల్లికార్జున, ఆచార్య పూర్ణచంద్రరావు తదితరులు పూలేకు నివాళులర్పించారు.



తెనాలి టీడీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న పట్టణ, మండల అధ్యక్షుడు హరిప్రసాద్, కోటేశ్వరరావు నాయకులు

● పెదకాకాని: పెదకాకాని మండలం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పెదకాకాని మండలం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించిన్నారు. కార్యక్రమంలో మండలంలోని పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం, మండలం, గ్రామం నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు నెంబర్లు, పార్టీ అనుబంధ కమిటీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

● కొల్లిపర: మండల కేంద్రం కొల్లిపర మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి, డీఎల్‌పీవో స్వరూపరాణి, ఎంపీడీవో విజయలక్ష్మి వివిధ శాఖాధికారులు జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ భార్గవ్, పరిపాలనాధికారి ప్రతాప్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస మూర్తి, మాజీ ఎంపీటీసీ భీమవరపు సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● తెనాలి క్రైం: సమాజానికి మహాత్మా జ్యోతిరావు పూలే అందించిన సేవలు మరువలేనివని తెనాలి బార్ అసోసియేషన్ కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం కోర్టు ప్రాంగణంలో సీనియర్ న్యాయవాదులు ఇందుపల్లి రాజారామ్, నాగమహేష్, అన్నం పిన్నారావు, సింగల రామ్మోహనరావు, నరాలశెట్టి సురేష్, జొన్నాదుల వెంకటేశ్వరరావు, కామినేని చిన్న, విజయకుమార్ తదితరులు పూలే చిత్రపటానికి ఘనంగా నివాలర్పించారు.

● తెనాలి, మారీసుపేట: జ్యోతీరావు పూలే జయంతిని శుక్రవారం స్థానిక మార్కెట్ సెంటర్‌లోని పురపాలక సంఘ కార్యాలయంలో మునిసిపల్ సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పాల్గొని కమిషనర్ బండి శేషన్న తో కలసి ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కమిషనర్ శేషన్న, ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మల, ఎంఈ శ్రీనివాసరావు డీఈ శ్రీనివాసలు, మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కొల్లిపరలో జ్యోతిరావు పూలే చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ పద్మావతి, అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ స్పెషల్ ఆఫీసర్ శంకర్

పన్నులపై వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకోవాలి

● పురపాలక సంఘ ప్రత్యేకాధికారి శంకర్

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం పన్నుదారులకు అమలు చేస్తున్న వడ్డీమాఫీ, రాయితీను సద్వినియోగం చేసుకోవాలని పురపాలక సంఘ ప్రత్యేకాధికారి వి.శంకర్ కోరారు. శుక్రవారం పురపాలక సంఘ కార్యాలయంలో పన్ను వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ 2024-2025 ఆర్థిక సంవత్సరానికి చెల్లించాల్సిన పన్నుపై విధించే వడ్డీని 50శాతం రాయితీకి వసూలు చేస్తున్నట్లు చెప్పారు. ఏప్రిల్ నెలాఖరు వరకు ఈ రాయితీ అమలులో ఉంటుందన్నారు. పన్నుదారులు వడ్డీ మాఫీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ప్రత్యేక అధికారి సూచించారు. సమావేశంలో మునిసిపల్ కమిషనర్ రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.



నవధాన్య విత్తనాలను అందిస్తున్న వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్ నాయక్ తదితరులు

ప్రకృతి సాగు పద్ధతులను అవలంభించాలి

● మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్ నాయక్

పొన్నూరు టౌన్ (చేబ్రోలు) ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి సాగు పద్ధతులు అవలంభించాలని మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్ నాయక్ అన్నారు. మండల పరిధిలోని వడ్లమూడి రైతు సేవ కేంద్రంలో శుక్రవారం పీఎండీఎస్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ ఖరీఫ్‌లో పంటసాగు చేసే 50 రోజుల ముందు 30 రకాల నవధాన్యాల విత్తనాలు, పచ్చిరొట్ట విత్తనాలు వంటి విత్తనాలను కలిపి భూమిలో నాటాలని సూచించారు. ఈ పంట ఎదిగిన తరువాత భూమిలో కలియదున్నిన తరువాత భూమిలో కర్బనశాతం పెరుగుతుందన్నారు. ఈ విత్తనాలలో పలురకాల కూరగాయలతో పాటు జనుము, జీలుగ, పిల్లిపెసర వంటి విత్తనాలు ఉంటాయన్నారు. విత్తనాలు సాగు చేయడం వలన భూమి గుల్లబారుతుందన్నారు. కలుపురాకుండా ఉండడంతోపాటు జీవ వైవిధ్యం కలిగిన సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు సూచించే అధికారులు సత్యనారాయణ, వీరలక్ష్మి, శ్యాంబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు మైలా వెంకటరామరాజు, తదితరులు పాల్గొన్నారు.

పొన్నూరు అభివృద్ధికి పలు ప్రతిపాదనలు

సీఎంకు విన్నవించా: ఎమ్మెల్యే నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు అభివృద్ధికి పలు ప్రతిపాదనలను ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద ఉంచినట్లు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ శుక్రవారం తెలిపారు. ప్రధానంగా గుంటూరు నుంచి బాపట్ల వెళ్లే ప్రధాన రహదారిపై రద్దీ పెరిగినందున తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రమాదాల నివారణకు జీబీసీ రోడ్డు విస్తరణ చేపట్టాలని ముఖ్యమంత్రిని కోరినట్లు చెప్పారు. ఇందుకు రూ.90 కోట్లతో ప్రదిపాదనలు సీఎంకు అందించినట్లు వివరించారు. అలాగే వైసీపీ ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వ నిధులైన జల జీవన్ మిషన్ పథకం ద్వారా పొన్నూరు పురపాలక సంఘానికి రూ.16.75కోట్లు మంజూరు అవ్వగా వైసీపీ పాలకులు ఆ నిధులను ఖర్చు చేయకుండా వృథా చేశారని అన్నారు. ఆ నిధులతో పెండింగ్‌లో ఉన్న 39 తాగునీటి పథకాలు పూర్తిచేసి ప్రజల దాహార్తిని తీర్చేలా నిధులు ఖర్చు చేసేందుకు అనుమతులు ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరినట్లు చెప్పారు. అలాగే తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు కార్యకర్తల సంక్షేమ నిధులు నుంచి నిధులు విడుదల చేయాలని ముఖ్యమంత్రిని కోరగా ఆయన సానుకూల స్పందించినట్లు చెప్పారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పొన్నూరు పట్టణ, మండలానికి చెందిన లబ్ధిదారులకు శుక్రవారం ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. నండూరు గ్రామానికి చెందిన పారి వెంకటేశ్వర్లుకు రూ.75వేలు, ఉప్పరపాలెంకు చెందిన సూరిశెట్టి శ్రీనివాసరావుకు రూ.18,441, కట్టెంపూడికి చెందిన వేంపాటి రూప శరణ్యకు రూ.10వేలు, పొన్నూరుకు చెందిన పిల్లుట్ల మహేష్‌బాబుకు రూ.1,16,608, తవ్వా రాజ్యలక్ష్మికి రూ.60వేలు, తుపాకులరెడ్డి అప్పారెడ్డికి రూ.28వేలు, వై.మామిళ్లమ్మకు రూ.25వేలు, పాతూరి రాకేష్‌కు రూ.18,819 చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

ప్రతి ఒక్కరికీ ఉపాధి చూపించాలి: పీడీ శంకర్

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో పనులు కోరిన ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు చూపించాలని ఉపాధి హామీ పథకం ప్రాజెక్టు డైరెక్టర్ వి.శంకర్ ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఉపాధి హామీ పథకంపై పీడీ శంకర్ సమీక్ష నిర్వహించారు గ్రామాల వారీగా నిర్వహించిన సమీక్షలో ఆయా గ్రామాలలో జరుగుతున్న పనులు, ఉపాధి హామీ కూలీల వివరాలు, తదితర అంశాల గురించి సమీక్ష నిర్వహించారు. నీటి కుంటల నిర్మాణం, పశువుల నీటి తొట్టెలు, పనులు, వేగవంతం చేయాలని ఆదేశించారు. పని దినాలు ఉంచుకుని పనులు ఇవ్వని సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏర్పాటు చేసుకున్న లక్ష్యాలను అధిగమించేలా సిబ్బంది కష్టించి పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్‌రావు, ఏపీవో సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ముగిసిన ఏఎన్‌యూ మహోత్సవం

పెదకాకాని, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సాంకేతిక కళాశాల ఆధ్వర్యంలో జరుగుతున్న ఏఎన్యూ మహోత్సవం-2025 కార్యక్రమంలో భాగంగా రెండో రోజు శుక్రవారం లఘు చిత్ర పోటీలు జరిగాయి. ఈ విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన వాటికి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు జరిగిన క్రీడల పోటీలలో విజేతలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు ప్రదానం చేశారు. క్రికెట్, వాలీబాల్, ఫుట్ బాల్, త్రోబాల్, టెన్నికాయిట్, 200, 400 మీటర్ల పరుగు పందాలు నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులు తమ సాంస్కృతిక కార్యక్రమాలతో ఆహుతులను అలరించారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ కే.గంగాధర్, రెక్టర్ ప్రొఫెసర్ కె.రత్న శిలామణి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి సింహాచలం, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల దాహార్తి తీర్చడం అభినందనీయం

● ఎమ్మెల్యే నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రజలు పాదచారుల దాహార్తి తీర్చడం అభినందనీయం అని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. పట్టణంలోని రేపల్లె బస్ సెంటర్ వద్ద ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే నరేంద్రకుమార్ ప్రారంభించారు. వేసవి ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున పట్టణంలో మరిన్ని చలి వేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు, ఆటో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

● డీఎల్‌పీవో స్వరూపరాణి

కొల్లిపర, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీఎల్‌పీవో విడవలూరి స్వరూపరాణి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అన్నవరంలంక పంచాయతీ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి పంచాయతీ సిబ్బందికి పారిశుధ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా స్వరూపరాణి మాట్లాడుతూ రోడ్డుపక్కన వ్యర్థాలను కాల్చితే తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. వ్యర్థాలను రోడ్డుపక్కన కాల్చడం వలన ప్రజలకు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. తడి చెత్తను, పొడి చెత్తను తప్పనిసరిగా వేరుచేయాలన్నారు. రోడ్ల పక్కన చెత్తలేకుండా చూసుకోవాలన్నారు. పంచాయతీ అధికారులు స్వచ్ఛ సంపద ప్రాధాన్యంపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. తనిఖీలో డీఎల్‌పీవో భార్గవ్ పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.



వక్ఫ్ సవరణ చట్టానికి నిరసనగా తెనాలిలో ధర్నా చేస్తున్న ముస్లింలు

వక్ఫ్ సవరణ చట్టంపై నిరసన

తెనాలి అర్బన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ చట్టాన్ని సవరించడాన్ని నిరసిస్తూ ముస్లింలు పట్టణంలోని శివాజీ చౌక్‌లో శుక్రవారం ధర్నా చేశారు. జామియా మసీదులో నమాజ్ అనంతరం పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముస్లిం మైనారిటీల ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ముఫ్తి హైదర్ ఆలీ పేర్కొన్నారు. ఈ చట్టం సవరణ చేయడం వలన వక్ఫ్ ఆస్తులను కేంద్రం స్వాధీనం చేసుకునే దురుద్దేశం దాగి ఉందన్నారు. వెంటనే సవరించిన చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సంఘాల ప్రతినిధులు ముఫ్తి అలావుద్దీన్, రియాజ్, ఉస్మాన్, జుబేర్, ఇమ్రాన్, షబీర్ అన్సారీ, ముతవల్లీలు పాల్గొన్నారు.



వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా పొన్నూరులో నిరసన ప్రదర్శన చేస్తున్న ముస్లింలు

● పొన్నూరు టౌన్: కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన వక్ఫ్ సవరణ చట్టాన్ని తక్షణమే నిలిపివేయాలని ముస్లింలు డిమాండ్ చేశారు. శుక్రవారం పొన్నూరు పట్టణంలో, అంజుమన్ కమిటీ, ముస్లిం మైనార్టీల ఆధ్వర్యంలో భారీ నిరసన ప్రదర్శన జరిగింది. ప్రార్థనల అనంతరం పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌కు చేరకున్న వేలాదిమంది ముస్లిం, మైనార్టీ నాయకులు నల్లచట్టాలను రద్దు చేయాలని న్యాయం కావాలని, నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఐలాండ్ సెంటర్ నుంచి గాంధీ బొమ్మ సెంటర్ మీదగా పట్టణంలోని పలు ప్రాంతాల మీదగా ఈ ర్యాలీ జరిగింది.

రైతు రుణాల రద్దు కోసం పోరాటం చేయాలి

● ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివసాంబిరెడ్డి

కొల్లిపర, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నేడు పంటల మద్దతు ధరలు అమలు గ్యారెంటీ కోసం రైతు రుణాల రద్దు కోసం పోరాటం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దావులూరులో అఖిలభారత కిసాన్ సభ ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా రైతు జెండాను ఆయన రైతు సంఘ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం రైతు ఉద్యమం ఫలితంగా మూడు నల్లచట్టాలను రద్దు చేసి, దొడ్డిదారిన అమలు జరుపుతోందని మండిపడ్డారు. దీనివలన సహకార సంఘాలు, పాల సంఘాలు, వ్యవసాయ మార్కెట్ కమిటీలు రైతుల చేతుల నుంచి కార్పొరేట్లపరం అవుతాయన్నారు. రైతులు ఐక్యంగా పోరాటంచేసి వాటిని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు కోటా చంద్రశేఖర్, ముక్కంటి వేణుబాబు, రవికుమార్, నాగరాజు, జీవరత్నం, తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు అన్నదానం చేస్తున్న బృంద సభ్యులు

చినరావూరులో అయ్యప్పస్వామి జన్మదినం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): చినరావూరు సోమేశ్వరాలయంలో శుక్రవారం అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గత 13 ఏళ్లుగా గురుస్వామి సుందరరావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహిస్తున్నారు. హనుమాన్ అయ్యప్ప భక్త బృందం ప్రత్యేక భజనలు, పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. నరసింహారావు, బుచ్చయ్య, పాపారావు, గోపికృష్ణ, వినయ్‌కుమార్, మధుబాబు పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుడు గద్దె శివరావు మృతి

తెనాలి రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రంగస్థల కళాకారుడు గద్దె శివరావు (70) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. మండలంలోని కొలకలూరుకు చెందిన ఆయన ఏకపాత్రాభినయంలో విశేష ప్రతిభ కనబరిచి ప్రేక్షకుల మన్ననలు పొందారు. ఘంటసాల మధురగీతాలు కూడా ఆలపించి ఎందరో మనస్సులలో చెరగని స్థానం సంపాదించారు. ఆయన మృతికి కేంద్రసహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఘట్టమనేని రామకృష్ణలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం కూటమి శ్రేణులు కుటుంబసభ్యులను పరామర్శించి తక్షణసాయంగా రూ.5000 అందించారు. ఆయన చేసిన సేవలను మననం చేసుకున్నారు. కార్యక్రమంలో బోడపాటి విజయ్‌కృష్ణ, వి.అనీల్‌కుమార్, గుంటూరు కృష్ణమోహన్, కలకండ శేషయ్య, గురవయ్య, కొండలు, దుర్గ తదితరులు పాల్గొన్నారు.